మెదక్ । సంగారెడ్డి । సిద్దిపేట
వార్త

సిద్దిపేట జిల్లాలో ఘనంగా బక్రీద్

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :
సిద్దిపేట జిల్లాలో ముస్లిములు బక్రీద్ పర్వదినాన్ని గురువారం ఘనంగా జరుపుకున్నారు. పండగను పురస్కరించుకొని ఉదయానే ్న నూతన వస్త్రాలు ధరించిన ముస్లింలు సమీప ఈద్గాల్లో ప్రార్థనలు జరిపారు. సిద్దిపేటలోని ప్రధాన ఈద్గా, చిన్న మసీదు, పెద్దమసీదుతోపాటు చుట్టుపక్కల గ్రామాల్లోని మసీదుల్లో ముస్లింలు ప్రార్థనలు జరిపారు. అనంతరం ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సిద్దిపేటతోపాటు జిల్లాలోని అయా మండలాల్లో బక్రీద్ పండగను ఘనంగా జరుపుకున్నారు.

ఈద్గాల వద్ద బందోబస్తు...
బక్రీద్ పర్వదినం సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఈద్గా, మసీదుల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలోని మెదక్, కరీంనగర్ రోడ్డు, కమాన్, బరాయిమామ్ తదితర ప్రాంతాల్లోని ఈద్గాలను పోలీసు అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించారు. అలాగే జిల్లాలోని గజ్వేల్, హుస్నాబాద్ పట్టణాలలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

విఓఏల సమస్యలను పరిష్కరించండి

చిన్నశంకరంపేట, మే 28, ప్రభాతవార్త: విఓఏల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్‌చేస్తూ విఓఏలు నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ కనీస వేతనం 20వెల రుపాయలు పెంచాలని, అర్హులైన ప్రతి విఓఏలను సీసీలుగా పదోన్నతి కల్పించాలని, ఆరోగ్య భీమా కల్పించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించేవరకు జూన్ 3 నుండి జిల్లాల్లో నిరసన కార్యక్రమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల విఓఏలు నాగరాజు, స్వప్న, లత, నాగాగౌడ్ తదితరులు పాల్గోన్నారు.

చిన్నశంకరంపేటలో నిరసన తెలుపుతున్న విఓఏలు

జాతీయ పురస్కారాలు అందుకుంటున్న విసి డాక్టర్ ప్రవీణ్‌రావు

కావేరి వైస్ చాన్సలర్‌కు జాతీయ పురస్కారాలు

వర్గల్, మే 28 (ప్రభాతవార్త): వ్యవసాయం, ఉద్యానవరం, విద్యా రంగం, విద్యాసంస్థల అభివృద్ధికి చేసిన విశిష్ట సేవలకుగానూ కావేరి యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ వి.ప్రవీణ్‌రావుకు రెండు ప్రతిష్టాత్మక జాతీయ పురస్కారాలు సిహెచ్ఏఐ హానరరీ ఫెలో-2026, అమిత్ కృషి ఋషి అవార్డు-2026 లభించాయి. హర్యానా రాష్ట్రం కర్నాల్‌లోని మహారాణా ప్రతాప్ హార్టికల్చర్ యూనివర్సిటీలో నిర్వహించిన జాతీయ సదస్సులో ఈ అవార్డులను ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నాయాబ్‌సింగ్ సైనీ ప్రదానం చేశారు. ఈ పురస్కారాలు కావేరి యూనివర్సిటీకి మాత్రమే కాకుండా మొత్తం విద్యా, వ్యవసాయ రంగాలకు గర్వకారణమని పేర్కొన్నారు. వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ వి.ప్రవీణ్ రావు మాట్లాడుతూ ఈగౌరవాన్ని యూనివర్సిటీ కుటుంబ సభ్యులందరికీ అంకితం చేస్తున్నట్లు తెలిపారు. విద్య, వ్యవసాయ పరిశోధనలు, సమాజాభివృద్ధికి, నాణ్యమైన విద్యాసంస్థల నిర్మాణంలో మరింత కృషి చేస్తానని తెలిపారు. వైస్ చాన్సలర్ ప్రవీణ్‌రావును యూనివర్సిటీ చాన్సలర్ జి.భాస్కర్‌రావు, రిజిస్ట్రార్ డాక్టర్ బి.శ్రీనివాసులు, డైరెక్టర్ పోల్సాని హర్షరావు, డీన్‌లు డాక్టర్ ప్రతాప్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ కొండ శ్రీనివాస్, డాక్టర్ సునీతా మెహతా, సీనియర్ ప్రొఫెసర్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

గజ్వేల్‌లో బిజెపిని బలోపేతం చేయాలి

రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్‌రావు

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడిని సన్మానిస్తున్న గజ్వేల్ బిజెపి నేతలు

గజ్వేల్, మే 28 (ప్రభాతవార్త): బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావును వారి నివాసంలో గురువారం ఆ పార్టీ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ రైతన్నల కష్టాలు చూసి కదిలిన బిజెపి నాయకుల బృందం చేసిన రైతు గోస బిజెపి భరోసా కార్యక్రమం మూడు రోజులుగా విజయవంతంగా నిర్వహించిన సందర్భంగా రాంచందర్‌రావును కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ గజ్వేల్ నియోజకవర్గంలో బిజెపి బలోపేతం చేయాలని సూచించారు. నియోజకవర్గంలో సమస్యలపై పార్టీ నాయకులు పోరాడుతున్న తీరును ఆయన అభినందించారు. ప్రజా సమస్యలపై పోరాటం చేస్తే ప్రజల మద్దతు లభిస్తుందని, అది బిజెపి బలోపేతానికి దోహదం చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో బిజెపి సిద్దిపేటజిల్లా అధ్యక్షులు బైరి శంకర్, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, మాజీ సర్పంచ్ నత్తి మల్లేశం, గజ్వేల్ మున్సిపల్ బిజెపి అధ్యక్షుడు దేవులపల్లి మనోహర్‌యాదవ్, గజ్వేల్, తూప్రాన్ మున్సిపల్ కౌన్సిలర్లు రొట్టెల శ్రీనివాస్, చందా అశోక్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి

కామారంలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి

చిన్నశంకరంపేట, మే 28,ప్రభాతవార్త: రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటను కొనుగోలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి ఆరోపించారు. గురువారం మండల పరిధి కామారంలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో మొలకెత్తిన ధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో రోజుల తరబడి ఉండటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. నెలల తరబడి ధాన్యాన్ని తరలించకపోవడం సరికాదన్నారు. లారీలు సక్రమంగా కేంద్రాలకు రాకపోవడం, మిల్లులవద్ద సకాలంలో అన్‌లోడింగ్ కాకపోవడంతో రైతులు ధాన్యం బస్తాలవద్దే పడిగాపులుకాసే పరిస్థితి ఉందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు, ధాన్యం తూకం సంచులు అందుబాటులో లేవన్నారు. వ్యవసాయం కోసం చేసిన అప్పులను తీర్చడానికి రైతులు ఆత్మహత్యలకు పాల్పడితే ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడ లేదన్నారు. ధాన్యం సకాలంలో సేకరిస్తే రైతులకు డబ్బులు వచ్చేవన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులకు కష్టాలే తప్ప సంతోషం లేదన్నారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ నగేష్‌తో ఫోన్ మాట్లాడి తడిసిన ధాన్యాన్ని బాయిలర్ రైస్ మిల్లులకు తరలించాలని, లారీలను తరలించి ధాన్యాన్ని సాధ్యమైనంత త్వరగా తరలించాలని అన్నారు. ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని కొనాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు రాజు, సర్పంచి నరేష్, శ్రీనివాస్, యాదగిరి, దయానంద్ పాల్గొన్నారు

ఇసుక అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు సీజ్

చిన్నశంకరంపేట,మే 28,ప్రభాతవార్త: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్‌లను సీజ్ చేసినట్లు ఎస్ఐ శివానందం తెలిపారు. భాగీర్తిపల్లి గ్రామంలో ఇసుక అక్రమంగా తరలిస్తున్నారన్నా సమాచారంతో దాడులు నిర్వహించగా రెండు ట్రాక్టర్లు పట్టుబడ్డట్లు తెలిపారు. డ్రైవర్లు శేఖులు, రమేష్ లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



సీజ్ చేసిన ట్రాక్టర్

కొనుగోళ్ల జాప్యం.. రోడ్డెక్కిన రైతులు

చిలిపిచెడ్, మే 28 ప్రభాతవార్త : మెదక్ జిల్లా చిలిపిచేడ్ మండలం చిట్కుల్ గ్రామానికి చెందిన రైతులు మెదక్ సంగారెడ్డి జిల్లా ప్రధాన రహదారిపై చిట్కుల్ గ్రామంలో రాస్తారోకో నిర్వహించారు. ధాన్యం కుప్పలు కల్లాలపై పోసి 40 రోజులు కొనుగోలు కేంద్రాల వద్ద ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైతుల ఆందోళనలతో రహదారిపై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ఉండడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ రోడెక్కారు చిట్కుల్ గ్రామానికి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వారు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి కేవలం రెండు లారీలు కేటాయించడంతో రైస్‌మిల్లు వద్ద లారీ లోడ్‌కాక అక్కడే ఉండిపోవడంతో పాటు వాతావరణంలో మార్పులు చూస్తూ మంగళవారం రాత్రి కురిసిన వర్షం ఈదురు గాలులతో కూడిన అకాలవర్షం ధాన్యం తడిసి తీవ్రంగా నష్టపరిచిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. త్వరగా ధాన్యం కొనాలని రైతులు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. దీనిపై సంబంధిత సొసైటీ చైర్మన్, డైరెక్టర్లు పూర్తిగా నిర్లక్ష్యం

మెదక్ సంగారెడ్డి జిల్లా ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షానికి ధాన్యం తడవడం వల్ల తడిసిన ధాన్యాన్ని కొనడం లేరని ఆరోపించారు. ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని చెప్పినప్పటికీ కింది స్థాయి అధికారులు మాత్రం కొనడం లేరని ఆరోపించారు.

మెదక్ సంగారెడ్డి ప్రధాన రహదారి పై ధ్యానం బస్తాలు అడ్డుగా పెట్టి ఆందోళన చేపట్టారు. ఘటనా స్థలానికి చేరుకున్న చిలిపిచెడ్ పోలీసులు రైతులను సముదాయించారు. దీనిపై సంబంధిత అధికారులు చొరవ చూపి తమకు న్యాయం చేయాలని రైతులు విజ్ఞప్తి చేశారు.

రైతులతో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ నగేష్

వేగంగా ధాన్యం అన్‌లోడింగ్ జరగాలి

మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్

కొల్చారం, మే 28 (ప్రభాతవార్త): రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తున్న ధాన్యాన్ని వేగంగా అన్లోడింగ్ చేసి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ గోడౌన్ నిర్వాహకులను ఆదేశించారు. గురువారం కొల్చారం మండలం వరిగుంతం గ్రామంలో ఉన్న గిడ్డంగిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు, నిల్వ కోసం ఏర్పాటుచేసిన గోడౌన్‌ను పరిశీలించి అక్కడి పరిస్థితులను తెలుసుకున్నారు. సేకరించిన ధాన్యాన్ని గిడ్డంగిలో నిల్వ చేయనున్నట్లు తెలిపారు. గిడ్డంగిలోని నిల్వ సామర్థం, అందుబాటులో ఉన్న సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన అదనపు కలెక్టర్ సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ధాన్యం అన్లోడింగ్‌లో ఆలస్యం జరగకుండా లారీలు, లేబర్‌ను తగినంతగా అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అన్లోడింగ్ పనులను మరింత పకడ్బందీగా నిర్వహించాలని, హమాలీలను షిఫ్ట్‌ల వారీగా పని చేయించాలని ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ పట్టణ ఇన్‌చార్జిగా అనంతకిషన్

సదాశివపేట, మే 28 (ప్రభాత వార్త): కాంగ్రెస్ పార్టీ సదాశివపేట పట్టణ పూర్తిస్థాయి ఇన్‌చార్జిగా, అలాగే మున్సిపల్ వ్యవహారాల ఇన్‌చార్జిగా తోపాజి అనంతకిషన్‌ను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జగ్గారెడ్డి నియమించారు. ఈ సందర్భంగా పట్టణ కమిటీ నియామక వ్యవహారాల బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. అలాగే సమన్వయ కర్తలుగా కంబలపల్లి రాంరెడ్డి, సీడీసీ చైర్మన్ సిద్దన్న, బ్లాక్ ప్రెసిడెంట్, నియోజకవర్గ కన్వీనర్ ఆంజనేయులు తదితరులతో సమన్వయంతో కలిసి పనిచేయాలని జగ్గారెడ్డి సూచించారు. పార్టీ బలోపేతం, కార్యక్రమాల నిర్వహణలో కొత్త బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని తోపాజి అనంత కిషన్ తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

మొగుడంపల్లిలో పిహెచ్‌సిని పరిశీలిస్తున్న చైర్మన్ వినయ్ కుమార్

సమయ పాలన పాటించని వైద్య సిబ్బంది

-పని తీరును మార్చుకోవాలని చైర్మన్ సూచన

మొగుడంపల్లి, మే 28, ప్రభాతవార్త:
మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పిహెచ్‌సి) జిల్లా నేషనల్ ఉమెన్ రైట్స్ కమిటీ చైర్మన్ వినయ్‌కుమార్ గురువారం ఆసుపత్రిని సందర్శించారు. ఆసుపత్రికి చైర్మన్ చేరుకున్న తరుణంలో డాక్టర్, స్టాఫ్ నర్స్, ఇతర ఇతర సిబ్బంది విధుల్లో లేకపోవడంతో చైర్మన్ సిబ్బంది పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ వినయ్‌కుమార్ మాట్లాడుతూ వైద్యులు, వైద్య సిబ్బంది అందుబాటులో లేకుంటే రోగులు పడే ఇబ్బందులు వర్ణణాతీతంగా ఉంటాయని విచారం వ్యక్తం చేశారు. ఫార్మసీకి సంబంధించిన ఒకరు మాత్రమే విధి నిర్వాహణలో ఉన్నారని పేర్కొ న్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విధుల్లో ఉండాల్సిన వైద్య సిబ్బంది మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల లోపే ఇండ్లకు వెళ్లిపోతున్నారని విచారం వ్యక్తం చేశారు. అత్యవసరమై ఆసుపత్రికి వచ్చిన రోగులకు వైద్యం అందుబాటులో లేక పరేషాన్ అవుతున్నారని మండి పడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నా వైద్య సిబ్బంది ప్రభుత్వ ఆశయం నీరుగారేలా చేయడం తగదని హెచ్చరించారు. ఆసుపత్రిలో వైద్యులు, వైద్య సిబ్బంది రోగులకు అందుబాటులో ఉంటూ మెరుగ్గైన వైద్యం అందించేలా చూడాలని జిల్లా ఉన్నతాధికారులకు చైర్మన్ వినయ్ కుమార్ సూచించారు. వైద్యులు, వైద్యసిబ్బంది అంకిత భావంతో విధులు నిర్వ హించేందుక సమయపాలన పాటించాలని వినయ్‌కుమార్ సూచించారు. చైర్మన్ వెంట ఎన్‌హెచ్‌ఆర్‌సి న్యాల్‌కల్ మండల చైర్మన్ బి రాజు, నరసింహులు ఉన్నారు.

'గో టు విలేజ్'ను విజయవంతం చేయాలి : ఎమ్మార్పీఎస్

గజ్వేల్ టౌన్, మే 28 (ప్రభాతవార్త): మంద కృష్ణమాదిగ ఆదేశాల మేరకు గురువారం గజ్వేల్ పట్టణంలో నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల సమీక్ష సమావేశంను నియోజకవర్గ ఇంచార్జ్ ఉబ్బని ఆంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మార్పీఎస్ సిద్దిపేట జిల్లా ఇంచార్జ్ మంద కుమార్, సీనియర్ నాయకులు మల్లిగారి యాదగిరి, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సామ్రాట్ ప్రకాష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంద కుమార్ మాట్లాడుతూ మాదిగ సామాజిక వర్గంలో డ్రాపౌట్‌ను తగ్గించి విద్యావకాశంలో అందిపుచ్చుకునే విధంగా మార్గ నిర్దేశం చేసి అక్షరాస్యతను పెంపొందించడం కోసం జులై 5వ తేదీ వరకు 40 రోజుల పాటు గో టు విలేజ్ ప్రోగ్రాం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేసిన సమగ్ర కుటుంబ సర్వే నివేదికలో మాదిగలు అక్షరాస్యతలో తీవ్రంగా వెనుకబడి ఉన్నారని, మాదిగలకు విద్య యొక్క ప్రాధాన్యతను వివరించి అక్షరాస్యతను పెంపొందించడం కోసం గ్రామాల్లో చైతన్య సదస్సులు నిర్వహించాలని పిలుపునిచ్చారు. మాదిగ జాతి ఆత్మగౌరవానికి ప్రత్యేకంగా నిలుస్తున్న ఎమ్మార్పీఎస్ ఉద్యమం 32వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి గ్రామంలో నూతన జెండా గద్దెను నిర్మాణం చేసుకొని ఎమ్మార్పీఎస్ జెండా పండుగ జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మైస రాములు, ముంద్రాతి కృష్ణ, బుడిగె మహేష్, మొండి రమేష్, గడ్డం కిషన్, మధు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిరక్ష్యంతోనే ధాన్యం కొనుగోలులో జాప్యం

ఎమ్మెల్యే సునీతలక్ష్మారెడ్డి

వెల్దుర్తి, మే 28, ప్రభాతవార్త : రైతులు ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యానికి కొనుగోలులో జాప్యానికి కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతలక్ష్మారెడ్డి అన్నారు. గురువారం వెల్దుర్తిలోని కుక్కునూరు చౌరస్తా వద్ద రైతులతో టిఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. ధర్నాలో ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వం కపట ప్రేమ చూపిస్తుందన్నారు. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు సరైన సౌకర్యాలులేక తీవ్ర ఇబ్బందులుపడుతున్నారని ఆమె ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యంతోనే లింగాపూర్‌లో రైతులు ఆగ్రహంతో ధాన్యాన్ని దగ్ధం చేసే పరిస్థితి వచ్చిందన్నారు. ఎద్దు ఏడ్చిన వ్యవసా..రైతు ఏడ్చిన రాజ్యం చరిత్రలో బాగుపడలేదంటూ రైతుల కన్నీటి శాపంతో ప్రభుత్వం కూలిపోతుందని ఆమె హెచ్చరించారు. తడిసిపోయిన, మొలకెత్తిన, రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోయిన ధాన్యాన్ని వెంటనే తరలించాలని ఆమె డిమాండ్ చేశారు. లేనియెడల రైతులతో కలిసి పెద్దఎత్తున ఉద్యమిస్తామని ఆమె హెచ్చరించారు. ధర్నాతో రహదారిపై వాహనాలు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న తూప్రాన్ సిఐ వెంకట్ రాజ్ గౌడ్, స్థానిక ఎస్సై రాజు, ఆర్ఐ నర్సింగ్‌యాదవ్ సంఘటన స్థలం చేరుకొని చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి రమేష్‌గౌడ్,పార్టీ మండల అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, కృష్ణగౌడ్, ప్రతాప్‌రెడ్డి, నర్సింలు, శ్రీనివాస్‌రెడ్డి, మురళి, శ్రీనివాస్‌గౌడ్, శ్రవణ్‌కుమార్, సత్యనారాయణ, మహేందర్, అశోక్‌రెడ్డి, శేఖర్, శంకర్‌రెడ్డి, కిట్టు, రమేష్ చందర్, హనుమంత్‌రెడ్డి, మైసయ్య, ఆయా గ్రామాల నాయకులు కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.


వెల్దుర్తిలో ధర్నా నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, నాయకులు, రైతులు

వడ్ల కుప్పను ఢీకొని యువకుడి మృతి

పుల్‌కల్, మే 28, ప్రభాతవార్త: రహదారిపై ఆరబెట్టిన ధాన్యం కుప్పను ఢీకొని ఒక యువకుడు మృతి చెందిన సంఘటన ఉమ్మడి పుల్‌కల్ మండలంలోని ఇసోజీపేట గ్రామ శివారులో బుధవారం అర్థరాత్రి చోటు చేసుకుంది. మండల పరిధిలోని మిన్‌పూర్ గిరిజన తండాకు చెందిన కడావత్ జైసింగ్ అలియాస్ జయంత్‌కుమార్(35) సంగారెడ్డి పట్టణం నుంచి ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతున్న క్రమంలో రహదారిపై ఆరబెట్టిన వరికుప్పకు ఢీకొని తీవ్ర గాయాలకు గురికాగా 108 అంబులెన్స్ లో పుల్‌కల్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు జయంత్‌కుమార్‌కు భార్య జ్యోతి, కుమార్తె శివరాణి ఉన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి కుటుంబాన్ని గిరిజన సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు జైపాల్‌నాయక్, గిరిజన తండా సర్పంచ్ అమున శంకర్ నాయక్, హన్యా నాయక్, గిరిజన తండా సర్పంచ్ కవిత సేనాపతిలు పరామర్శించి ఓదార్చారు. వడ్లను రోడ్డుపై ఆరబెట్టడంతోనే జైసింగ్ కానరాని లోకాలకు చేరిపోయాడని, మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని తండా వాసులు డిమాండ్ చేశారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

కొండపాక, మే 28, ప్రభాతవార్త : ప్రమాదవశాత్తు చెట్టుపై నుండి కిందపడి వివాహిత మహిళ మృతి చెందిన సంఘటన తిమ్మారెడ్డిపల్లిలో గురువారం ఉదయం చోటుచేసుకుంది. గ్రామస్తులు, కుకునూరుపల్లి ఎస్సై పండుగ శ్రీనివాస్ కథనం ప్రకారం...గ్రామానికి చెందిన బొగ్గుల లక్ష్మి (40) మేకలకు మేత కోయడానికి చెట్టుపైకి ఎక్కి కోస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్‌వైర్ తగిలి మృతి చెందినట్లు తెలిపారు. చెట్టుపైనున్న విద్యుత్ వైర్‌లను చూసుకోకుండా కొమ్మ ఎక్కిన ఆమెకు షాక్ తగిలి మృతి చెందిన తర్వాతే చెట్టుపైనుంచి కిందపడినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కుకునూరుపల్లి ఎస్సై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట జనరల్ అసుపత్రికి తరలించారు.

చేపల వేటకు వెళ్లి నీటమునిగి వ్యక్తి మృతి

పాపన్నపేట, మే 28, ప్రభాతవార్త : చేపలు వేటకు వెళ్లి ప్రమాదవశాత్తూ నీట మునిగి ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని నాగ్సాన్‌పల్లి శివారులోని చెలిమకుంటలో గురువారం జరిగింది. ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ కథనం ప్రకారం...నాగ్సాన్‌పల్లి గ్రామానికి చెందిన గుండు కిష్టయ్య(48) వ్యవసాయంతో పాటు చేపలు విక్రయం చేస్తూ జీవితం గడుపుతున్నాడు. కాగా మంగళవారం సాయంత్రం చేపల వేటకు వెళ్తున్నానని చెప్పి బయటకు వెళ్లి గ్రామ శివారులో చెలిమ కుంట చెరువులో చేపలు పడుతుండగా కాళ్లకు వల చుట్టుకోవడంతో ప్రమాదవశాత్తూ నీట మునిగి మృతి చెందాడు. ఎంతకీ తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు చుట్టూ పక్కల వెతికారు. గురువారం ఉదయం నాగ్సాన్‌పల్లి గ్రామ శివారులోని చెలిమకుంటలో అటుగా వెళ్లిన స్థానికులు నీటిలో మృతదేహన్ని గమనించి పోలీసులకు, కుటుంబ సభ్యులు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహన్ని వెలికి తీయించి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుమారుడు రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ వివరించారు.

రామాయంపేట బస్టాండ్‌లో చోరీ

మూడు గంటల్లోనే నిందితుల అరెస్ట్

రామాయంపేట, మే28, ప్రభాతవార్త: బస్టాండ్‌లో బుధవారం మధ్యాహ్నం జరిగిన చోరీ కేసును పోలీసులు కేవలం మూడు గంటల్లోనే ఛేదించారు. ప్రయాణికురాలి బ్యాగ్‌లో నుంచి 4.5 తులాల బంగారు ఆభరణాలు కొట్టేసిన ఇద్దరు అంతర్రాష్ట్ర మహిళా దొంగలను అరెస్ట్ చేసి, సొత్తును పూర్తిగా స్వాధీనంచేసుకున్నారు. సిఐ సైదా కథనం ప్రకారం... రాజన్న సిరిసిల్ల జిల్లా, గంభీరావుపేట మండలం భీమునిమల్లారెడ్డిపేటకు చెందిన సుద్దాల దేవాలక్ష్మి ృ ప్రాథమిక పాఠశాల వంట మనిషి. రామా యంపేట మండలం అక్కన్నపేటకు చెందిన కుమార్తె ఇంట్లో బోనాల ఉత్సవాలకు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. మే 27న మధ్యాహ్నం 2.30 గంటలకు రామాయంపేట బస్టాండ్‌లో కామా రెడ్డి వెళ్లే బస్సు ఎక్కుతుండగా, గుర్తుతెలియని ఇద్దరు యువతులు ఆమె భుజానికి ఉన్న సంచి నుంచి బంగారు ఆభరణాలు అపహరిం చారు. బస్సు దిగి చూసేసరికి సంచిలోని ప్లాస్టిక్ పెట్టెలో దాచిన సుమారు 49.100 గ్రాముల బంగారు ఆభరణాలు మాయమయ్యాయి. వాటి విలువ రూ.2.80 లక్షలు అని తెలిపారు.

సినీ ఫక్కీలో ఛేజింగ్...
బాధితురాలి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీ సులు బస్టాండ్ సీసీ కెమెరాలు పరిశీలించారు. ముఖాలకు స్కార్ఫ్‌లు కట్టుకున్న ఇద్దరు యువతులు చోరీచేసి మెదక్ బస్సు ఎక్కినట్లు గుర్తించారు. వెం టనే మెదక్ వెళ్లి అక్కడి సీసీ ఫుటేజీలు చూడగా, నిందితులు బోధన్ డిపోకు చెందిన జేబీఎస్ బస్సు లో ఉన్నట్లు తేలింది. బస్సు కండక్టర్‌ను ఫోన్‌లో సంప్రదించి, బస్సును బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ వద్ద ఆపించారు. హెడ్ కానిస్టేబుల్ వి.దామోదర్, మహిళా కానిస్టేబుల్ డి.మోనిక అక్కడికి వెళ్లి నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

అరెస్టయిన నిందితులు...
ఏ1 శ్వేత కాలే(23) కర్నాటకలోని గుల్బర్గా జిల్లా భరత్‌నగర్ తండా వాసి, ఏ2 శిల్పావేలు(20) మహా రాష్ట్రలోని పూణే నగరవాసి. వీరిపై గతంలో రామాయంపేట, గజ్వేల్,చేగుంట పోలీస్‌స్టేషన్లతోపాటు వికారాబాద్ జిల్లా దోమ, మోమిన్‌పేట పీఎస్‌ల లోనూ చోరీ కేసులు ఉన్నాయి.

స్వాధీనం చేసుకున్న సొత్తు...
20.200 గ్రాముల బంగారుగొలుసు, 24.200 గ్రాముల బంగారు హారం, 4.700 గ్రాముల బంగారు ఉంగరం మొత్తం 49.100 గ్రాములు కాగా తూప్రాన్ డీఎస్పీ జె.నరేందర్‌గౌడ్ పర్యవేక్షణలో, సీఐ బి.సైదా ఆధ్వర్యంలో ఎస్ఐలు ఆర్.బాలరాజు, ఎం.నరేష్,కానిస్టేబుల్ భాస్కర్, హోంగార్డు సూర్య ప్రకాష్ చాకచక్యంగా వ్యవహరించి నిందితులను పట్టుకున్నారు. కేసు ఛేదనకు సహకరించిన బస్ డ్రైవర్, కండక్టర్‌లతో పాటు పోలీసు సిబ్బందిని మెదక్ ఎస్పీ డి.వి.శ్రీనివాసరావు అభినందించారు. తగిన రివార్డు అందజేస్తామని తెలిపారు.

ప్రజలకు సీఐ బి. సైదా సూచన...
ఈ సందర్భంగా సీఐ బి.సైదా మాట్లాడుతూ, బస్టాండ్, రైల్వే స్టేషన్లు వంటి రద్దీ ప్రదేశాల్లో ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలన్నారు. బస్సు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు తోపులాటలో దొంగలు చేతివాటం ప్రదర్శిస్తారని, విలువైన బంగారు ఆభరణాలు, నగదు, సెల్‌ఫోన్లు వంటివి బ్యాగుల్లో కనిపించేలా పెట్టుకోవద్దన్నారు. వీలైనంత వరకు బ్యాగును

వివరాలు తెలుపుతున్న పోలీసులు

భారీవర్షానికి జలమయమైన రహదారులు

-ప్రజలకు తీవ్ర ఇబ్బందులు

జలమయమైన సుభాష్‌గంజ్‌లోని డిసిఎంఎస్ కాంప్లెక్స్ సముదాయం

జహీరాబాద్, మే 28, ప్రభాతవార్త:
బుధవారం తెల్లవారుఝామున కురిసిన భారీవర్షంతో పట్టణంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఉదయంవరకు ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షానికి రహదారులన్నీ వర్షపునీటితో నిండిపోవడంతో ప్రజలు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. లోతట్టు ప్రాంతాల్లో భారీగా నీరునిలిచిపోవడంతో కాలనీవాసులు ఆందోళన వ్యక్తంచేశారు. పట్టణంలోని సుభాష్‌గంజ్, డిసిఎంఎస్ కాంప్లెక్స్, బాగారెడ్డివిగ్రహం సమీపంలోని బ్లాక్ రోడ్, రాజన్నపేట్ తదితర ప్రాంతాల్లో వర్షపునీరు భారీగా నిలిచింది. మురుగు కాల్వలు, నాళాలు మట్టితో మూసుకుపోవడం వల్ల వర్షపునీరు సక్రమంగా వెళ్లక రోడ్లపై నిలిచిపోయింది. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర అవస్థలుపడ్డారు. సమాచారం అందుకున్న 27వవార్డు కౌన్సిలర్ నామ స్రవంతిరవికిరణ్ ప్రభావిత ప్రాంతాలను సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. మున్సిపల్ సిబ్బందితో కలిసి సహాయకచర్యలు చేపట్టి నిలిచిన నీరు వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. పట్టణంలో నీటినిల్వ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు డిమాండ్‌చేశారు.

రాస్తారోకోతో రైతుల ఆందోళన

ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసనచేస్తున్న రైతులు

కొల్చారం, మే 28, ప్రభాతవార్త:
కొల్చారంమండలంలో మంగళవారం అర్థరాత్రినుంచి బుధవారం తెల్లవారుఝామువరకు కురిసిన అకాలవర్షం అన్నదాతలను తీవ్ర ఆందోళనకు గురిచేసింది. మండలంలోని యనగండ్ల, ఏటిగడ్డ మాందాపూర్, కోనాపూర్, పైతర, తుక్కాపూర్, కొల్చారం, రంగంపేట, చిన్నగణాపూర్ తదితర గ్రామాల్లోని కొనుగోలుకేంద్రాల వద్ద ధాన్యంరాశులు వర్షపునీటితో చెరువులను తలపించాయి. వరి కుప్పలు, తూకం వేసిన బస్తాలు పూర్తిగా తడిసిపోవడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తంచేశారు. ఆరుకాలం శ్రమించి పండించిన పంట కళ్లముందే తడిసిపోవడంతో రైతులు కన్నీరుమున్నీరయ్యారు. తడిసిన ధాన్యాన్ని తరుగు విధించకుండా వెంటనే కొనుగోలు చేసి, లారీలను పంపించి ధాన్యాన్ని తరలించాలని డిమాండ్‌చేస్తూ రంగంపేట ప్రాథమిక వ్యవసాయ సహకారసంఘం పరిధిలోని రైతులు మెదక్-సంగారెడ్డి ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సుమారు రెండు గంటలపాటు రహదారిపై ధర్నా కొనసాగడంతో భారీగా వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. రైతులకు మద్దతుగా సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు, పైతర సర్పంచ్ యాబన్నగారి రవితేజరెడ్డి, బిఆర్ఎస్ యువజన అధ్యక్షుడు కోనాపూర్ సంతోష్‌రావు, వైస్‌చైర్మన్ మల్లేశం, అరిగే విజయ్, కాశీనాథ్ తదితరులు ధర్నాలో పాల్గొన్నారు. సమాచారం అందుకున్న కొల్చారం ఎస్సై మహమ్మద్ మొహినుద్దీన్ సంఘటన స్థలానికి చేరుకుని రైతులను శాంతింపజేయడానికి ప్రయత్నించారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాస్‌చారి అక్కడికి చేరుకుని రైతులతో మాట్లాడారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసేందుకు లారీలను పంపిస్తామని, రైతులు ఎవరూ అధైర్యపడవద్దని, చివరిగింజ వరకు ప్రభుత్వమే కొనుగోలుచేస్తుందని హామీ ఇచ్చారు. దీంతో రైతులు తమ ఆందోళనను విరమించారు. కార్యక్రమంలో పలువురు రైతులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యంతో రైతుల ఆందోళన

-జాతీయ రహదారిపై బైఠాయింపు, ధాన్యం తగలబెట్టి నిరసన

రోడ్డుపై బైఠాయించిన రైతులు నాయకులు

గుమ్మడిదల, మే 28, ప్రభాతవార్త:
అకాలవర్షాలకు తడిసిపోయిన ధాన్యాన్ని కొనుగోలుచేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపిస్తూ రైతులు ఆందోళనకు దిగారు. ఇప్పటికే సాగుఖర్చులు, పెట్టుబడులభారం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు తడిసిన ధాన్యం సమస్య మరిన్ని కష్టాలను తెచ్చిపెట్టిందని వారు ఆవేదన వ్యక్తంచేశారు. తమ సమస్యలను అధికారులు పట్టించుకోవడం లేదని నిరసిస్తూ రైతులు తడిసిన ధాన్యంతోనే జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. దీంతో కొంతసేపు వాహనాల రాకపోకలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ధాన్యాన్ని కొనుగోలుచేయాలని డిమాండ్‌చేస్తూ కొందరురైతులు ఆగ్రహంతో రహదారిపైనే తడిసిన ధాన్యాన్ని తగలబెట్టి నిరసన వ్యక్తంచేశారు. ఈఘటనతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రైతులను శాంతింపజేసేందుకు పోలీసులు, అధికారులు రంగంలోకిదిగారు. సమాచారం అందుకున్న రెవెన్యూ, మార్కెటింగ్‌శాఖ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని రైతులతో చర్చలు జరిపారు. అధికారులహామీతో రైతులు తమ ఆందోళనను విరమించారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణచర్యలు తీసుకుని తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతుసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఘనంగా మాద్వార్ ప్రీమియర్ లీగ్

కప్పు అందజేస్తున్న అందజేస్తున్న సర్పంచ్

నారాయణఖేడ్, మే 28, ప్రభాతవార్త:
మాద్వార్ గ్రామంలో మాద్వార్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఘనంగా నిర్వహించడంజరిగింది. నిర్వహించిన తుది క్రీడాపోటీలలో విజేతలుగా నిలిచిన జట్లకు బహుమతులు ప్రదానంచేయడం జరిగింది. ఇందులో మొదటిబహుమతిని దోపూరుతాండ జట్టు, రెండవబహుమతిని బుద్రాన్పల్లి ఏ జట్టు గెలుచుకుంది. అలాగే మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డును శంకర్ అందుకున్నారు. సర్పంచ్ బేగరి స్వరూపసంజీవులు ఆధ్వర్యంలో ఈ క్రీడాపోటీలు విజయవంతంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ నర్సింలు, యూత్‌కాంగ్రెస్ నారాయణఖేడ్ మండలం అధ్యక్షులు పిట్ల శివరాజ్ వార్డ్ సభ్యులు మచ్చుకూరి శంకర్, పిట్ల సిద్దప్ప, బేగరి వెంకట్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రామాగౌడ్, కోవూరి నరేష్, యువత క్రీడాకారులు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ పనితీరుపై డిపిఓ ప్రశంసలు

శాలువతో సన్మానిస్తున్న దృశ్యం

కొల్చారం, మే 28, ప్రభాతవార్త:
కొల్చారం మండల పరిధిలోని పోతంశెట్టిపల్లి గ్రామపంచాయతీని జిల్లా పంచాయతీరాజ్ అధికారి (డిపిఓ) యాదయ్య గురువారం సందర్శించారు. ఈసందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్న రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించి వాటినిర్వహణపై సంతృప్తి వ్యక్తంచేశారు. అనంతరం గ్రామంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను పరిశీలించి గ్రామపంచాయతీ పనితీరును అభినందించారు. గ్రామాభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై సర్పంచ్, కార్యదర్శి, సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు అందజేశారు. ప్రజలకు మెరుగైనసేవలు అందించడంతోపాటు పారిశుధ్యం, పచ్చదనం, మౌలికసదుపాయాల అభివృద్ధిపై ప్రత్యేకదృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపివో సయ్యద్ మగ్దం, సర్పంచ్ పాతూరి దయాకర్ గౌడ్, కార్యదర్శి అరుంధతి, వార్డుసభ్యులు జలగం సంతోష్, బుట్ట శ్రీనివాస్, సగినాల దీవెన, సగినాల యశోద, సాయినీ యాదగిరి, నాకోటి జగన్నాథం, పట్నం ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల బక్రీద్ ప్రత్యేక ప్రార్థనలు

గుమ్మడిదల, మే 28, ప్రభాతవార్త:
గుమ్మడిదల పురపాలక సంఘం పరిధిలోని బొంతపల్లి ఈద్గా వద్ద బక్రీద్ పండుగ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ప్రత్యేకప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉద్యమకారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక యువకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక కన్వీనర్ మంద బాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఉద్యమకారులు రైల్‌రోకో, రాస్తారోకో, సడక్‌బంద్, వంటావార్పు, సకలజనుల సమ్మె వంటి అనేకపోరాట కార్యక్రమాల ద్వారా ప్రత్యేక తెలంగాణరాష్ట్ర సాధనలో కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. బక్రీద్ పర్వదినం శాంతి, సామరస్యానికి ప్రతీక అని పేర్కొంటూ సమాజంలోని అన్నివర్గాలు ఐక్యంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో దర్గా శ్రీనివాస్, వాలదాస్ మల్లేష్‌గౌడ్, కుమ్మరి వెంకటేష్, చింతల రాజు, అంజనేయులు, డప్పు జీవన్‌కుమార్, రామకృష్ణగౌడ్, ఎండి గరీబ్, రఫిక్, వడ్డెర ఎల్లయ్య తదితరులు పాల్గొని పరస్పరం అలయ్‌బలయ్ తీసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు

మొగుడంపల్లి, మే 28, ప్రభాతవార్త:
మండలంలోని ఆయా గ్రామాల రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్టె విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. జీలుగ 30కిలోల విత్తనాలు 50శాతం సబ్సిడీపై 2452 రూపాయలకు, జనుము 40కిలోల బస్తా సబ్సిడి పోను 3110 రూపాయలు, పిల్లి పెసర 20కిలోల బస్తా సబ్సిడీ పోను 1995 రూపాయలకు అందచేయడం జరుగుతుందన్నారు. రైతులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి అన్నారు.

30న జింఖానా గ్రౌండ్‌లో మా వైష్ణోదేవి జాగరణ

కంటోన్మెంట్, మే 28, ప్రభాతవార్త:
మా వైష్ణోదేవి జాగరణ మండల్ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీన రాత్రి సికింద్రాబాద్ చలో బులవ అయా హై మాతానే బులయ హై వేడుకలు బారీ ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు మావిష్ణోదేవి జాగరణ మండల్‌చైర్మన్ సురేందర్‌జోషి, వైస్‌చైర్మన్ వినోద్ పొద్దర్, అధ్యక్షులు కైలాస్‌చంద్ అగర్వాల్, ప్రధానకార్యదర్శి బి.ఎన్.శ్రీనివాస్‌లు తెలిపారు. గురువారం జింఖానాగ్రౌండ్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ గత 31 సంవత్సరాల నుంచి ప్రతి యేటా తమ సంస్థ సొంతనిధులతో మావిష్ణోదేవి జాగరణ వేడుకలు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. సనాతనధర్మాన్ని భావితరాలకు చాటిచెప్పే విధంగా హిందూ సంస్కృతీసంప్రదాయాలతో అమ్మ ఆశీస్సులతో వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. కులమతాలకు అతీతంగా దేశప్రజలు సుబిక్షంగా ఉండాలని ఈ వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 30న రాత్రి 8.30 ప్రారంభం అవుతుందన్నారు. ఈవేడుకలకు వచ్చే భక్తులకు జమ్మూ కాశ్మీర్‌లోని మా వైష్ణోదేవి ఆలయం నుంచి తెచ్చిన ప్రసాదంతో పాటు వైష్ణోదేవి ప్రతిమ ఉన్న నాణెన్ని భక్తులకు ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. ఈ జాగరణకు వచ్చే భక్తులకు ఉచితప్రవేశం ఉందన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండాప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు సంజయ్ అగర్వాల్, సందీప్‌సింగ్ పాల్గొన్నారు.

ఎల్ఓసీని సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే శ్రీగణేష్

అడ్డగుట్ట, మే 28, ప్రభాతవార్త:
కార్పొరేట్ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం చేయించుకునేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి వచ్చే ఎల్ఓసీని సద్వినియోగం చేసుకోవాలని కంటోన్మెంట్ ఎమ్మె ల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. 3వ వార్డు అన్నా నగర్‌కు చెందిన యాదమ్మకు 2.50 లక్షలు,హిమాయత్ సాగర్,శంకరం ప్రాంతానికి చెందిన వేణుగోపాల్‌కు 2.50 ఎల్ఓసీలను గురువారం తుకా రాంగేట్‌లోని ఎమ్మెల్యే నివాసంలో వారికి అందజేశారు.

ఘనంగా వీర్ సావర్కర్ జయంతి వేడుకలు

నిజాంపేట్, మే 28, ప్రభాతవార్త:
భారత స్వాతంత్ర్యోద్యమ వీరుడు వినాయక దామోదర్ సావర్కర్ జయంతి సందర్భంగా గురువారం ప్రగతినగర్ ఏనుగుబొమ్మల చౌరస్తాలో కార్యక్రమం నిర్వహించారు. తన కార్యాలతోనే కాకుండా రచనల ద్వారా కూడా బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన మహనీయుడిగా సావర్కర్‌ను వక్తలు స్మరించుకున్నారు. చాపేకర్ సోదరుల బలిదానంతో ప్రభావితమై స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తి పొందిన సావర్కర్ సోదరులు తమ జీవితాలను, ఆస్తులను భరత మాత సేవకే అంకితం చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎంఆర్ఎస్‌రాజు, నరేంద్రచౌదరి, విజయలక్ష్మిసుబ్బారావు, దాసి నాగరాజు, లక్ష్మీరామారావు, సత్య కాటేపల్లి, డాక్టర్ వెంకన్న, నవీన్‌చందర్, బండి చంద్రశేఖర్, రాజశేఖరరెడ్డి, ఫణి, రామనాయుడు, శ్రీనివాస్, కొండమ నాయుడు, నిఖిల్, సత్యనారాయణ, ధనంజయ, సూరిబాబు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కలిసిన కాంగ్రెస్ నేతలు

కార్వాన్, మే 28, ప్రభాతవార్త:
తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, శాసనమండలి సభ్యులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ను జన్మదినంను పురస్కరించుకొని కార్వాన్ నియోజకవర్గం కాంగ్రెస్ కమిటీ సీనియర్ నాయకులు కూరాకుల కృష్ణ బృందం మర్యాదపూర్వకంగా కలసి సంపూర్ణ ఆయురారోగ్యాలు, అపారమైన ప్రజాదరణతో, రాజకీయంగా మరింత ఉన్నతస్థాయికి ఎదగాలని కోరుకుంటూ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖులు గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ముంగి రఘపాల్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వెంకటకృష్ణ, వెంకట్ రెడ్డి, హనుమంత్‌రెడ్డి, మహేష్‌యాదవ్ పాల్గొన్నారు.

పేద విద్యార్థి చదువుకు ఆర్థికసాయం

యూసుఫ్‌గూడ, మే 28, ప్రభాతవార్త:
తమకు ఉన్నదాంట్లో కొంత ఇతరులకు సహాయం చేసినప్పుడే జీవితంలో నిజమైన సంతృప్తి లభిస్తుందనేదానికి నిదర్శనంగా ఓ విద్యార్థిని తన కిడ్డీ బ్యాంక్ నుంచి మరో పేదవిద్యార్థి చదువుకోసం ఆర్థికసాయాన్ని అందించింది. అల్లాపూర్ డివిజన్ వివేకానంద్‌నగర్‌కు చెందిన తేజామై నాయుడు తన జన్మదినం సందర్భంగా పంచశిల కాలనీ ప్రగతి స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న విశాల అనే విద్యార్థి ఫీజు కట్టలేక ఇబ్బంది పడుతున్నారు. విషయం తెలుసుకున్న తేజామై నాయుడు విద్యార్థికి తన కిడ్డీ బ్యాంక్‌లో దాచుకున్న రూ.25 వేలను పాఠశాల యాజమాన్యం, తల్లిదండ్రులు లైన్స్ క్లబ్ ప్రతినిధుల సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా తేజామై నాయుడిని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ బంజారాహిల్స్ చైర్మన్ కెల్లా వెంకట్‌రావు, మాజీ కౌన్సిలర్ సత్యనారాయణ, లయన్స్ క్లబ్ గౌవర్నర్ డాక్టర్ మహేందర్‌రెడ్డి, ప్రెసిడెంట్ కైలాష్, సభ్యులు కృష్ణయ్య, దామోదర్, రమేష్ నాయుడు, శ్రీలత, సౌజన్య, వాణి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసానికి వేసవి శిక్షణాశిబిరాలు

ఖైరతాబాద్, మే 28, ప్రభాతవార్త:
ఖైరతాబాద్ నియోజకవర్గంలోని చింతల్ బస్తీ ప్రాంతంలో గల డా. బి.ఆర్. అంబేద్కర్ శతాబ్ది హాల్‌లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరం (జిమ్నాస్టిక్స్ యోగా)ను ఖైరతాబాద్ నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే, మాజీ కార్పొరేటర్ విజయరెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా విజయరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు, యువత వేసవిసెలవులను సద్వినియోగం చేసుకుంటూ క్రీడలు, యోగా వంటి కార్యక్రమాల్లో పాల్గొనడం ఎంతో అవసరమన్నారు. యోగా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందని, జిమ్నాస్టిక్స్ క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, శారీరక దారుఢ్యాన్ని పెంపొందిస్తుందని తెలిపారు. ప్రస్తుత కాలంలో పిల్లలు మొబైల్ ఫోన్లు, టీవీలకు ఎక్కువ సమయం కేటాయిస్తున్న నేపథ్యంలో ఇటువంటి శిక్షణాశిబిరాలు వారిలో చురుకుదనం, ఏకాగ్రత పెంచేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. పిల్లలప్రతిభను వెలికితీసి భవిష్యత్తులో ఉన్నతస్థాయికి తీసుకెళ్లే దిశగా తల్లిదండ్రులు కూడా ప్రోత్సహించాలని సూచించారు. ఈశిబిరంలో పాల్గొంటున్న విద్యార్థులకు ఉత్తమశిక్షణ అందించాలని నిర్వాహకులకు సూచించిన విజయరెడ్డి, సమాజంలో ఆరోగ్యవంతమైన వాతావరణం ఏర్పడేందుకు యోగా, క్రీడలు కీలకపాత్ర పోషిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జిమ్నాస్టిక్స్ యోగా శిక్షకులు గోర్ల వినయ్‌కుమార్, జిమ్నాస్టిక్స్ శిక్షకులు జి.బ్రహ్మానందప్రసాద్, స్థానికనాయకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయం

-మాజీ కార్పొరేటర్ జితేందర్‌నాథ్

అల్వాల్, మే 28, ప్రభాతవార్త:
ప్రజాసమస్యల పరిష్కారంకోసం నిరంతరాయంగా పనిచేయడం జరుగుతుందని మచ్చబొల్లారం మాజీకార్పొరేటర్ జితేందర్‌నాథ్ పేర్కొన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని పంచవటి కాలనీలో స్థానికులతో కలిసి జితేందర్‌నాథ్ పాదయాత్ర చేయడం జరిగింది. సిసి రోడ్లు మరమ్మతులు, ఓపెన్ నాలాలకు సంబంధించిన సమస్యలను పరిశీలించారు. ఓపెన్ జిమ్ ఏర్పాటు, గ్రీనరీ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు సురేందర్ రెడ్డి, సర్వేశ్‌యాదవ్, కొండల్‌రెడ్డి, జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన జంపన

కంటోన్మెంట్, మే 28, ప్రభాతవార్త:
తాగ్యం, ప్రేమ, సోదరబావానికి బక్రీద్ ప్రతీక అని అల్లాహ్ ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ తెలిపారు. బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం బోయిన్‌పల్లిలోని పలుదర్గాల్లో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు చోటూ, మౌలా, సులేమాన్, సాయిబాబాయాదవ్, కరన్‌సింగ్, బండి శ్రీనివాస్, యాదగిరి, గణేష్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక బక్రీద్

-పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ

కెపిహెచ్‌బి కాలనీ, మే 28, ప్రభాతవార్త:
పవిత్ర బక్రీద్ పర్వదినం సందర్భంగా ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ ఈద్గా వద్ద గురువారం జరిగిన సామూహిక ప్రార్థనలో మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్‌తో కలిసి పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రార్థనలు చేసి ముస్లింలకు బక్రీద్ పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవిత్ర బక్రీద్ కేవలం ఒక పండుగ మాత్రమే కాదని, అది దైవభక్తికి, నిస్వార్థత్యాగానికి నిదర్శనం అని, అల్లాపట్ల ప్రవక్త ఇబ్రహీం చూపిన అచంచలమైన విశ్వాసాన్ని స్మరించుకుంటూ ముస్లింలు ఈపండుగను జరుపుకుంటారని, బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, ముస్లింలు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మానవత్వానికి ప్రతీక బక్రీద్: సురేష్‌రెడ్డి

జీడిమెట్ల, మే 28, ప్రభాతవార్త:
మానవత్వానికి ప్రతీక బక్రీద్ అని సురేష్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని సూరారం కాలనీ రాజీవ్ గృహకల్ప మస్జిద్‌లో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి పాల్గొని ముస్లింలకు పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా సురేష్ రెడ్డి మాట్లాడుతూ త్యాగం, ప్రేమ, దాతృత్వం, మానవత్వానికి ప్రతీకగా నిలిచే బక్రీద్‌పండుగను ముస్లింలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారని అన్నారు. దేవుని ఆజ్ఞను శిరసావహిస్తూ తన కుమారుడిని సైతం త్యాగం చేయడానికి సిద్ధపడిన ప్రవక్త ఇబ్రహీం నిబద్ధతకు ఈపండుగ చిహ్నంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఖుర్బానీ ఇచ్చిన మాంసాన్ని పేదలు, బంధుమిత్రులతో పంచుకోవడం బక్రీద్ పండుగ ప్రత్యేకత అని తెలిపారు. ఈ పర్వదినం సమాజంలో సోదరభావం, ప్రేమ, శాంతి పెంపొందించేలా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, స్థానిక మస్జిద్ కమిటీ సభ్యులు, ముస్లిం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయబద్ధంగా బక్రీద్

చాంద్రాయణగుట్ట, మే 28, ప్రభాతవార్త:
త్యాగానికి ప్రతీకైన బక్రీద్ (ఈద్ అల్ అదా) పండుగను పాతబస్తీవ్యాప్తంగా ముస్లింలు సంప్రదాయబద్ధంగా, భక్తిప్రపత్తులతో జరుపుకున్నారు. ఉదయం నుండే కుటుంబసభ్యులు, స్నేహితులు, బంధువులతో కలిసి సమీపంలోని మసీదులు, ఈద్గాలకు వెళ్ళి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు 'ఈద్' ముబారక్ తెలుపుకున్నారు. ప్రత్యేక ప్రార్థనలను పురస్కరించుకొని ప్రార్థనా స్థలాల వద్ద ప్రభుత్వ అధికారులు పెద్ద ఎత్తున ఏర్పాట్లుచేశారు. భారీసంఖ్యలో పోలీసులను మోహరించారు. పలుచోట్ల ట్రాఫిక్‌ను దారి మళ్లించారు. ఇక సంప్రదాయం ప్రకారం మేకలు, గొర్రెలను ఖుర్బానీ ఇచ్చారు. బల్దియా అధికారులు పోలీసుల సహకారంతో జంతువ్యర్థాల తొలగింపుకు ప్రత్యేక బృందాలను, ప్లాస్టిక్ కవర్లను, వాహనాలను సమకూర్చారు. అయితే పండుగను మరో రెండు మూడు రోజులు జరుపుకోనున్నారు. పలుచోట్ల గొర్రెల, మేకల సంతలు, విక్రయాలు కొనసాగుతున్నాయి.

కార్మికుడికి సిపిఆర్ చేసిన కానిస్టేబుల్

కార్వాన్, మే 28, ప్రభాతవార్త:
కార్వాన్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో అసిస్టెంట్ లైన్‌మ్యాన్‌గా విధులు నిర్వహిస్తున్న రాజునాయక్(44) అనే కాంట్రాక్ట్ కార్మికుడు కార్వాన్, కుమ్మరవాడి హనుమాన్ దేవాలయం సమీపంలో ఒక విద్యుత్ స్తంభంపై మరమ్మతు పనులుచేస్తుండగా ప్రమాదవశాత్తు హైటెన్షన్ వైర్‌ను తాకడంతో తీవ్రమైన విద్యుత్‌ఘాతానికి గురై స్తంభం పైనుండి కింద పడిపోయాడు. దీనితో కార్మికుడి శ్వాస ఆగిపోయి గుండె కొట్టుకోవడం నెమ్మదించి అక్కడికక్కడే స్పృహ కోల్పోయిన సమయంలో సమీపంలోనే గస్తీ విధుల్లో ఉన్న టప్పాచబుత్రా పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ పి.సి.4938 బి.సురేష్ బాధితుడి ఛాతిపై క్రమబద్ధంగా ఒత్తిడి తీసుకురావడంతో కొద్దిసేపటికే రాజునాయక్ గుండె స్పందన పునరుద్ధరించబడి, ఊపిరి పీల్చుకోవడం ప్రారంభించారు. కానిస్టేబుల్ సురేష్ స్థానికుల సహాయంతో బాధితుడిని తదుపరి మెరుగైనవైద్యం కోసం అత్యవసర వాహనంలో ఆసుపత్రికి తరలించగా ప్రస్తుతం అతని ఆరోగ్యం స్థిరంగా ఉందని, ఎలాంటి ప్రమాదంలేదని వైద్యులు ధృవీకరించారు. ఆపత్కాలంలో అసాధారణ సమయస్ఫూర్తిని, ధైర్యసాహసాలను ప్రదర్శించి ఒక ప్రాణాన్ని కాపాడిన కానిస్టేబుల్ బి.సురేష్‌ను టప్పాచబుత్రా పోలీస్‌స్టేషన్ హౌస్ ఆఫీసర్ జి.బాలకృష్ణ ప్రత్యేకంగా అభినందించారు.

బహుముఖ ప్రతిభావంతుడు సురవరం ప్రతాపరెడ్డి

-తెలంగాణ సారస్వత పరిషద్ అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి

ముషీరాబాద్, మే 28, ప్రభాతవార్త:
బహుభాషావేత్తగా, సాహితీవేత్తగా, చరిత్రకారుడుగా, పత్రిక సంపాదకుడుగా, గ్రంథాలయ ఉద్యమ సారథిగా తెలంగాణ ప్రజలను జాగృతం చేసిన సురవరం ప్రతాపరెడ్డి బహుముఖ ప్రతిభావంతుడని తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి కొనియాడారు. గురువారం సురవరం ప్రతాపరెడ్డి 130వజయంతి సందర్భంగా ట్యాంక్ బండ్ పైనున్న ఆయన విగ్రహానికి పూలమాలలువేసి, ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎల్లూరి శివారెడ్డి మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనలో నలిగిపోతున్న తెలుగు భాషా సంస్కృతులకు దిశా నిర్దేశంచేసిన ప్రజ్ఞాశాలి అయిన సురవరం ప్రతాపరెడ్డి ఆంధ్ర గ్రంథాలయ ఉద్యమానికి అధ్యక్షులుగా పనిచేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సురవరం ప్రతాపరెడ్డి సాహిత్య వైజ యంతి ట్రస్టు కార్యదర్శి సురవరం పుష్పలతరెడ్డి, సభ్యులు సురవరం కృష్ణవర్ధన్‌రెడ్డి, సురవరం కుటుంబసభ్యులు, రచయితలు, కవులు తదితరులు పాల్గొన్నారు.

కొత్త సంజీవరెడ్డి సేవలు అమోఘం: శ్రీగణేష్

కంటోన్మెంట్, మే 28, ప్రభాతవార్త:
కాంగ్రెస్ పార్టీకి, ఆర్టీసీ కార్మికులకు కొత్త సంజీవరెడ్డి చేసిన సేవలు అమోగమని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. సికింద్రాబాద్ మహేంద్రహిల్స్‌లో నివాసం ఉంటున్న ఆర్టీసీ హైదరాబాద్ రీజియన్ మాజీ చైర్మన్ కొత్త సంజీవరెడ్డి ఈ నెల 20న గుండెపోటుతో మృతిచెందాడు. గురువారం పెద్ద గోల్కొండ సంఘీగూడలో నిర్వహించిన సంతాపసభలో ఆయన పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో గణేష్ దేవాలయం చైర్మన్ ప్రభాకర్ యాదవ్, కంటోన్మెంట్ కాంగ్రెస్ నేతలు బల్వంత్‌రెడ్డి, గజ్వెల్ భరత్, దర్గా రవి, ఇటుక గోపిలు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీలకు శుభాకాంక్షలు తెలిపిన టిఎన్

అడ్డగుట్ట, మే 28, ప్రభాతవార్త:
బక్రీద్‌ను ప్రపంచవ్యాప్తంగా ఉన్న ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారని బోయిన్‌పల్లి మార్కెట్ మాజీచైర్మన్ టిఎన్.శ్రీనివాస్ తెలిపారు. బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం 2వ వార్డు గన్‌బజార్, ఇందిరమ్మనగర్, రసూల్‌పుర ప్రాంతాల్లోని ముస్లిం మైనార్టీలను కలిసి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

టిడిపితోనే రాజకీయ చైతన్యం

-పార్లమెంట్ టిడిపి అడహక్‌కమిటీ మెంబర్ బి.గౌరిశంకర్‌యాదవ్

అడ్డగుట్ట, మే 28, ప్రభాతవార్త:
ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీతోనే తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ చైతన్యం వచ్చిందని మల్కాజిగిరి పార్లమెంట్ టీడీపి అడహక్ కమిటీ మెంబర్ బి.గౌరి శంకర్ యాదవ్ తెలిపారు. మాజీ సిఎం ఎన్టీరామారావు 103 జయంతిని పురస్కరించుకొని గురువారం రెజిమెంటల్ బజార్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు జ్ఞానేశ్వర్, రామ్‌దేవ్, అనీల్, నర్సింగ్‌రావ్, వినోద్, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ రంగం ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక

-మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబు

కెపిహెచ్‌బి కాలనీ, మే 28, ప్రభాతవార్త:
నారెడ్కో వెస్ట్ జోన్ బిల్డర్స్ అసోసియేషన్ 10వ వార్షికోత్సవ వేడుకలు, వార్షిక సర్వసభ్య సమావేశం సంధ్య కన్వెన్షన్ గచ్చిబౌలిలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిలుగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర ఐటి, ఈ-పరిశ్రమలు, వాణిజ్యం, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి, సావనీర్ పుస్తకాలను విడుదల చేసారు. కార్యక్రమంలో నారెడ్కో వెస్ట్‌జోన్ బిల్డర్స్ అసోసియేషన్ ముఖ్య సలహాదారులు డా.సత్యం శ్రీరంగం, నర్రా నాగేశ్వరరావు, నారెడ్కో నేషనల్ రియల్‌ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ పూర్వఅధ్యక్షుడు హరిబాబు, తెలంగాణ అధ్యక్షుడు కె.శ్రీధర్‌రెడ్డి జనరల్‌సెక్రటరీ ఆర్.వెంకటేశ్వరరావు, కార్యనిర్వాహక ఉపాధ్యక్షులు కాళిప్రసాద్, గోపాలకృష్ణ, ఉపాధ్యక్షుడు ఎం.ప్రేమకుమార్, టీబీఎఫ్ అధ్యక్షుడు సి.ప్రభాకర్‌రావు, నారెడ్కో వెస్ట్‌జోన్ బిల్డర్స్ అసోసియేషన్ చైర్మన్ వడ్డేపల్లి రంగరావు, వైస్‌చైర్మన్ బి.లక్ష్మీనారాయణ, అధ్యక్షుడు కోటేశ్వరరావు, సలహాదారులు, నారెడ్కో జనరల్‌సెక్రటరీ కె.వి.ప్రసాదరావు, ట్రెజరర్ సిహెచ్.రామ్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ఉపాధ్యక్షుడు వేళుపోలు శ్రీనివాసరావు, బిల్డర్స్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నకిలీ నంబరు ప్లేటుతో ఉన్న కారు స్వాధీనం

జూబ్లీహిల్స్, మే 28, ప్రభాతవార్త:
నకిలీ నంబర్ ప్లేట్‌తో ప్రయాణిస్తున్న ఒక వాహనదారుడిపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో బక్రీద్ పండుగ ఏర్పాట్ల సందర్భంగా ట్రాఫిక్ ఎస్సై ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఇందులోభాగంగా జహీరానగర్ ఓపెన్‌గ్రౌండ్‌లో పార్క్ చేసిన వాహనాలను తొలగిస్తుండగా ఏపీ37ఏఆర్ 9099 నంబర్ కలిగిన మారుతి స్విఫ్ట్ కారుకు సంబంధించిన యజమానిని సంప్రదించగా, ఖమ్మంకు చెందిన మండల జశ్వంత్ స్పందించాడు. అయితే తన వాహనం ప్రస్తుతం తన దగ్గరే ఉందని, అదే నంబర్‌తో మరో వాహనం తిరుగుతోందని అనుమానం వ్యక్తంచేస్తూ ఫోటోను పంపించాడు. దీంతో పోలీసులు స్థానికంగా విచారణ చేపట్టగా, జహీరానగర్‌కుచెందిన ఇమ్రాన్ గౌరీ అనేవ్యక్తి ఆకారును తరచూ అక్కడ పార్క్ చేస్తున్నట్లు గుర్తించారు. విచారణలో అసలు వాహనం నంబర్ పీబీ03ఎన్4993 కాగా, దానిపై నకిలీగా ఏపీ37ఏఆర్9099 నంబర్ ప్లేట్ అమర్చినట్లు గుర్తించారు. నకిలీ నంబర్ ప్లేట్‌తో వాహనాన్ని నడిపినందుకు ట్రాఫిక్ పోలీసులు శాంతిభద్రతలవిభాగ పోలీసులకు ఫిర్యాదుచేయగా ఎస్సై జి.సంధ్యారాణి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

మానసిక వికలాంగురాలైన మహిళను అప్పగించిన పోలీసులు

గోషామహల్, మే 28, ప్రభాతవార్త:
గోషామహల్ పోలీసులు అత్యంత అప్రమత్తతతో వ్యవహరించి, సమాచారం అందుకున్న కొద్దిగంటల్లోనే మానసికస్థితి సరిగాలేని ఓ మహిళను రక్షించి, కుటుంబసభ్యులకు అప్పగించారు. ఇన్‌స్పెక్టర్ బి.శ్రావణ్‌కుమార్ కథనం ప్రకారం...ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని వనపర్తి గ్రామానికి చెందిన పద్మ'(45), ఐదురోజుల క్రితం ఇంటి నుంచి చెప్పపెట్టకుండా బయటకు వెళ్లిపోయింది. కుటుంబసభ్యులు పలుచోట్ల, బంధువులకు ఫోన్‌చేసి సమాచారం తెలుసుకున్నారు. చివరకు వనపర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. కాగా ఈనెల 27వ తేదీన రాత్రి 10గంటల సమయంలో మతిస్దిమితం లేని మహిళా తిరుగుతుందని పోలీసులకు సమాచారం అందించారు. నైట్ ద్యూటి పెట్రోలింగ్ ద్యూటీలో ఉన్న కానిస్టేబుళ్ల శంభులింగం, ఠాకూర్ ఆశిష్‌సింగ్‌లు నగర్‌ఖానాప్రాంతంలో ఉన్న తిరుగుతున్న మహిళాను గోషామహల్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. ఆమెను ఎక్కడినుంచి వచ్చావు, ఎందుకు వచ్చావు అడుగగా.. వనపర్తి అని చెప్పడంతో వెంటనే అక్కడి పోలీసులకు సమాచారం అందించారు. అక్కడి శ్రీరంగపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో మహిళా తప్పిపోయిన కేసు నమోదై ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వెంటనే మతిస్థిమితంలేని మహిళా, కుమారుడికి అక్కడి పోలీసులు సమాచారం అందించారు. పోలీసులు చాకచాక్యంగా వ్యవహరించి తప్పిపోయిన మానసిక స్థితి సరిగాలేని పద్మను గోషామహల్ పోలీస్‌స్టేషన్‌లో కుమారుడు బొరవెల్లి నరేందర్‌కు అప్పగించారు. ఈకేసు గోషామహల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

హఫీజ్‌పేట్‌లో ఘనంగా బక్రీద్ వేడుకలు

గచ్చిబౌలి, మే 28 ప్రభాతవార్త
త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ వేడుకలను గురువారం శేరిలింగంపల్లి నియోజకవర్గం హఫీజ్‌పేట్‌లో ముస్లీంలు అత్యంత భక్తిశ్రద్దలతో జరుపుకున్నారు. ఈసందర్భంగా హఫీజ్‌పేట్‌లోని నమాజ ఈదుల్ ఆజహ్ ఈద్గా దర్గా షరీఫ్ హజ్రత్ సాలార్ ఏ హౌలియాకు ముస్లీంలు భారీసంఖ్యలో చేరుకొని ప్రత్యేకప్రార్థనలు నిర్వహించారు. ప్రార్థనల అనంతరం ఒకరికి ఒకరు ఆలింగనం చేసుకుంటూ ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, స్థానికనాయకులు తదితరులు హాజరై ముస్లీంలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

ప్రతిభాపురస్కారాలకు దరఖాస్తులు

చిక్కడపల్లి, మే 28, ప్రభాతవార్త:
తెలుగురాష్ట్రాలకు చెందిన వివిధరంగాల్లోని ప్రతిభ గలవారికి ప్రముఖ సాంస్కృతిక సంస్థ అఖిల భారత తెలుగు సాంస్కృతిక సమైక్య సంస్థ రాష్ట్ర, జాతీయస్థాయిలో పలు అవార్డులకు దరఖాస్తులను ఆహ్వానిస్తుంది. సమైఖ్య జాతీయ అధ్యక్షుడు డాక్టర్.గణగళ్ళ విజయ్‌కుమార్ గురువారం డివిజన్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ రంగాల్లో ప్రతిభను చాటినవారికి అవార్డులకు అందజేయనున్నామని వివరించారు. ప్రతిభ కనపరిచినవారు తమ ఆధారాలకు, పాస్ పోర్ట్ సైజ్ ఫోటోను జతచేసి సెల్ నెంబర్ : 93913 79903కు జూన్ 6వ తేదీలోగా పంపాలని కోరారు. అర్హత సాధించిన వారికి జూన్ 22వ తేదీన అవార్డులను ప్రదానం చేయనున్నట్లు డాక్టర్. గణగళ్ళ విజయ్‌కుమార్ తెలిపారు.

పాత బస్టాండు చౌరస్తా వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఎం నేతలు

కేరళ మాజీ సిఎం ఇంటిపై ఈడి దాడులపట్ల ఖండన

సిద్దిపేట అర్బన్, మే 28, ప్రభాతవార్త : కేరళ మాజీ సిఎం, సిపిఎం పార్టీ పోలిట్‌బ్యూరో సభ్యులు పినరాయి విజయ్ ఇంటిపై ఈడి దాడులు నిర్వహించడం రాజకీయ కక్ష సాధింపు చర్యని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాళ్లబండి శశిధర్ అన్నారు. మాజీ సిఎం పినరాయి విజయ్ ఇంటిపై ఈడీ దర్యాప్తుల సంస్థల దాడులు నిర్వహించడాన్ని తీవ్రంగా ఖండిస్తూ జిల్లా కేంద్రంలోని పాత బస్టాండు చౌరస్తాలో గురువారం సిపిఎం పార్టీ అర్బన్ మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బిజెపి సర్కార్ అధికార మంద బలంతో ఏదైనా చేయొచ్చు అని చూస్తే సిపిఎం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. బిజెపి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా అన్నిపక్షాలను కలుపుకొని సిపిఎం ఉద్యమిస్తుందన్నారు. కార్యక్రమంలో సిపిఎం ప్రతినిధులు చొప్పరి రవికుమార్, జాలిగాపూర్ శిరీష, దాసరి ప్రశాంత్, చెప్యాల బాలమణి, కొండ సంజీవ్‌కుమార్, బత్తుల అభిషేక్‌బాన్, పాండు, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

రైతుల కష్టాలు ప్రభుత్వానికి కనిపించడం లేదు

మాజీ ఎమ్మెల్యే రసమయి

బెజ్జంకి, మే 28,ప్రభాతవార్త : మండల పరిధిలోని గుండారం గ్రామంలో ఏర్పాటు చేసిన ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సందర్శించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కొనుగోలు వేగవంతం చేయకపోవడం రైతులు రోజుల తరబడి పడిగాపులు కాస్తున్నారని వాపోయారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకవచ్చిన ప్రతి వరి గింజను పూర్తి స్థాయిలో కొనుగోలు చేసి మద్దతు ధరను చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా వెంట వెంటనే లారీల ద్వారా మిల్లులకు తరలించాలన్నారు. వర్షా కాలం కారణంగా రైతులకు ఇబ్బందులు ఎదురవుతాయని ధాన్యం కొనుగోలులో ఏమాత్రం నిర్లక్ష్యం చేయొద్దన్నారు. రైతుల కష్టాలు ప్రభుత్వానికి కనిపించడం లేదన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాకాల మహిపాల్‌రెడ్డి, సర్పంచ్ భీమయ్య, అంజయ్య, లింగారెడ్డి,శేఖర్‌బాబు, బోడబట్ల తిరుపతి, నరేష్, బీరయ్య, బాబు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న సిపిఎం నేతలు

కొమురవెల్లి, మే 28, ప్రభాతవార్త : కేరళ రాష్ట్రాన్ని పదేళ్లపాటు అభివృద్ధే ధ్యేయంగా పరిపాలించిన మాజీ సిఎం, సిపిఎం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు పినరై విజయన్ అద్దెకుంటున్న ఇంటిపై కేంద్ర ప్రభుత్వ సంస్థ ఈడీ సోదాలు చేయడం అత్యంత హేయమైన చర్య అని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శెట్టిపల్లి సత్తిరెడ్డి అన్నారు. కొమురవెల్లిలో గురువారం సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో విజయన్‌పై ఈడీ దాడులను నిరసిస్తూ కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సిఎం విజయన్ నివాసంపై ఈడీ జరిపిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ప్రతిపక్ష నాయకుడిపై కేంద్ర ప్రభుత్వం కక్షపూరితమైన దాడులు చేస్తుందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం రాజకీయ సవాళ్లను ఎదుర్కోలేక ఇలాంటి కుయుక్తులు పన్నుతుందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం సిపిఎం నాయకులపై ఈడీ దాడులు చేయడం మానుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బద్దిపడగ కృష్ణారెడ్డి, తాడూరి రవీందర్, ఉల్లంపల్లి సాయిలు, తేలు ఇస్తారి, తాడూరి మల్లేశం, కనుగుల రాజు, తాడూరి కవిత, పరమేశ్వర్, కర్రోల ఎల్లయ్య, దాసరి బాలస్వామి, తాడూరి ప్రశాంత్, దాసరి మహేష్, తాడూరి భరత్‌కుమార్, గుస్కా ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

విఓఏల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలి...

ఒంటి కాలిపై నిరసన తెలుపుతున్న వీఓఏలు

పాపన్నపేట, మే 28, ప్రభాతవార్త : వీఓఏల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ వీఓఏలు తహసీల్దార్ కార్యాలయం ముందు శాంతియుత నిరవధిక సమ్మె చేపట్టారు. సమ్మెలో భాగంగా రెండవ రోజైన గురువారం వీఓఏలు ఒంటికాలిపై నిలబడి వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు సాయగౌడ్ మాట్లాడుతూ, మహిళా సంఘాలను సామాజికంగా, ఆర్థికంగా బలోపేతం చేస్తూ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి సేవలు అందించినప్పటికి తమ న్యాయ మైన సమస్యలు పరిష్కరం కావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత, ప్రమాద భీమ, పదోన్నతులు వంటి ప్రధానమైన డిమాండ్లపై ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఉద్యోగ భద్రత, వేతనాలు, విధుల నిర్వహణలో ఎదురవుతున్న ఇబ్బందులపై పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా స్పందన లేకపోవడంతో ఆందోళన బాటపట్టాల్సి వచ్చిందన్నారు. సమస్యలు పరిష్కరించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. సమ్మెలో మండల పరిధిలోని వీఓఏలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అంబేద్కర్ డెవలప్‌మెంట్ కమిటీని సన్మానించిన సిఐ

గజ్వేల్ టౌన్, మే 28(ప్రభాతవార్త): పట్టణంలో నూతనంగా ఎన్నుకున్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ డెవలప్మెంట్ కమిటీని గురువారం పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో గజ్వేల్ సిఐ రవికుమార్ శాలువాలతో ఘనంగా సన్మానించారు. ప్రజా సంఘాల నాయకులు మైస రాములు, పొన్నాల కుమార్, తుమ్మ శ్రీనివాస్, నీరుడి స్వామి, బైరం శివకుమార్, చిప్పల యాదగిరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మస్కూరి కిష్టయ్య, బొల్లారం ఎల్లయ్య, ఉపాధ్యక్షులు మన్నె కృష్ణ, మాచపురం బాల్‌నర్సయ్య, పొట్ట యాదగిరి, కోశాధికారి పంబాల సత్యనారాయణ, గౌరవ అధ్యక్షులు అటకూరి రాములు, కార్యదర్శులు దమ్మని మల్లయ్య, మైస స్వామి, సల్ల నాగయ్య, మల్కగల్ల నాగయ్య, మైసని మల్లయ్య, చింతకింది బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్ అంబేద్కర్ డెవలప్మెంట్ కమిటీని సన్మానించిన దృశ్యం

ఏఐటియుసి మహాసభలను విజయవంతం చేద్దాం

జిల్లా ప్రధాన కార్యదర్శి కిష్టాపురం లక్ష్మణ్

జిల్లా నాల్గో మహాసభలను విజయవంతం చేయాలని పోస్టర్ ఆవిష్కరిస్తున్న నేతలు

సిద్దిపేట రూరల్, మే 28, ప్రభాతవార్త : భారతదేశంలో 1920 అక్టోబరు 31న ఆవిర్భావించిన మొదటి కార్మిక సంఘం ఏఐటియూసి అని జిల్లా ప్రధానకార్యదర్శి కిష్టాపురం లక్ష్మణ్ అన్నారు. ఏఐటియూసి జిల్లా నాలుగో మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ జిల్లా కేంద్రంలోని ఎడ్ల గురువారెడ్డి భవనంలో గురువారం కరపత్రం విడుదల చేసి మాట్లాడారు. స్వాతంత్ర్యానికి పూర్వమే ఫ్యాక్టరీల, పారిశ్రామిక విదానాల, కనీస వేతనాల చట్టం తదితర హక్కులను కార్మిక సంఘం లేని రోజుల్లోనే ఏఐటియూసి కార్మిక సంఘం సాధించి పెట్టిందన్నారు. పెట్టుబడిదారుల చేతుల్లో నలిగిపోతున్న కార్మిక వర్గాన్ని దిక్సు చిగా నిలిచి అనేక ఉద్యమాల ద్వారా కార్మిక చట్టాలను కార్మిక హక్కులను సాధించి పెట్టిన ఏకైక సంఘం ఏఐటియూసి అన్నారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వరంగ సంస్థలైన రైల్వే, బ్యాంకులు, విమానయం, పోర్టులు, ఎల్ఐసి, బిహెచ్ఈఎల్ తదితర పరిశ్రమలను బడావ్యాపారులకు అప్పగించారని తెలిపారు. ప్రభుత్వరంగ సంస్థలలో పనిచేస్తున్న లక్షలామంది కార్మికులు రోడ్డు పాలయ్యారని తెలిపారు. అనేక పోరాటాలు త్యాగాలు బలిదానాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్పులుచేసి కార్పొరేట్ సంస్థల యజమానులకు అనుకూలంగా అమల్లోకి తెచ్చారని తెలిపారు. సిఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో కార్మికులకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి రాగానే మర్చిపోయారని మండిపడ్డారు. అనేక రంగాలలో కార్మికుల హక్కులను సాధించిన ఘనత ఏఐటియూసిదేనని పేర్కొన్నారు. జిల్లా నాల్గో మహాసభలు జూన్ 17న జిల్లా కేంద్రంలోని శక్తి గార్డెన్‌లో నిర్వహించడం జరుగుతుందని జిల్లాలోని ఏఐటియూసి అనుబంధ కార్మికసంఘాల కార్మికులు, నాయకులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశాలకు జిల్లా సీపీఐ కార్యదర్శి మంద పవన్ ఏఐటియూసి జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి, భవన నిర్మాణ కార్మిక ప్రతినిధులు సంపత్, చంద్రం,బిక్షపతి, రాజు,మల్లయ్య, రాజ, శివరాములు హాజరవుతారని వివరించారు.


బక్రీద్ పండుగలో పాల్గొన్న ముత్తవల్లి మోలానా మసియోద్దీన్ తదితరులు

ఘనంగా బక్రీద్ పండగ వేడుకలు

నర్సాపూర్, మే 28, ప్రభాతవార్త : పట్టణంలో గురువారం ముస్లింలు బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నర్సాపూర్ లోని ఈద్గావద్ద ముస్లింల ముత్తావలి మోలానా మసియుద్దిన్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా నమాజ్ చేసి ఈద్ ఉల్ అజహా వంటి ప్రార్థనలు జరిపారు. ఒకరి నొకరు అలాయి భలాయి తీసుకొని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ సందర్భంగా హిందూ ముస్లింలనే బేద భావం లేకుండా బక్రీద్ పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో హఫీజ్, కుత్బుద్దీన్, రషీద్ అహ్మద్, గులాం మహమ్మద్, రఫీఉద్దీన్, ముస్లింలు తదితరులు పాల్గొన్నారు

వెల్దుర్తిలో...

ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థన నిర్వహిస్తున్న ముస్లింలు

వెల్దుర్తి, మే 28, ప్రభాతవార్త : మండల కేంద్రంలో ముస్లింలు గురువారం బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లింలు నూతన వస్త్రాలు ధరించి డబ్బు చప్పుళ్లతో ఈద్గా వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్థన చేశారు.అనంతరం కులమతాలకు అతీతంగా ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. త్యాగనిరతికి ప్రతీకగా పండుగ బక్రీద్ అని అన్నారు.

మర్కుక్ మండలంలో...

మర్కుక్, మే 28 (ప్రభాతవార్త): బక్రీద్ పండుగను మండల పరిధిలోని దామరకుంట, కర్కపట్ల, కాశిరెడ్డిపల్లి, మర్కుక్, ఎర్రవల్లితోపాటు పలు గ్రామాల్లో ముస్లింలు గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే నూతన దుస్తులు ధరించి ఈద్గాలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ పండుగ సోదర భావం, ఐక్యతకు ఆదర్శంగా నిలుస్తుందని, అల్లా ఆశీస్సులు ప్రజలందరికీ ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించామన్నారు. ఈ కార్యక్రమంలో దామరకుంట మజీద్ ఇమామ్ సాహెబ్, సదర్ రసూల్, ముస్లింలు మదార్, యాసిన్ ఖలీల్, లతీఫ్, ఖాదర్, రఫీక్, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

దామరకుంటలో బక్రీద్ వేడుకల్లో పాల్గొన్న ముస్లీంలు

గజగట్లపల్లిలో రైతులతో సెహగల్ ఫౌండేషన్ సభ్యులు

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన అవసరం

చిన్నశంకరంపేట, మే 28,ప్రభాతవార్త: ప్రస్తుతం వ్యవసాయంలో జరుగుతున్న మార్పులకనుగుణంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతీ రైతు సేంద్రియ వ్యవసాయంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఎస్ఎం.సెహగల్ ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. మండల పరిధి గజగట్లపల్లిలో గురువారం ఎస్ఎం. సెహగల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు పరివర్తన్ సహకారంతో గురువారం రైతులకు పంటసాగుపై అవగాహన కల్పించారు. రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రియ ఎరువులను వాడాలన్నారు. తప్పనిసరిగా మట్టి నమూనాలను సేకరించి పరీక్షలను చేయించాలన్నారు. పంట మార్పిడిచేయాలని, మందులను పిచికారి చేసినప్పుడు మాస్కులను ధరించాలన్నారు. అనంతరం రైతులకు క్విజ్ పోటీలను నిర్వహించి బహుమతులను అందించారు. కార్యక్రమంలో సర్పంచి నాగభూషణం, ఉప సర్పంచి రాజు, ఎస్ఎం.సెహగల్ ఫౌండేషన్ సభ్యులు గౌతమ్, మనిదీప్, కావ్య, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఆలయ అధ్యక్షుడిగా నామినేషన్ వేసిన సురేష్

గజ్వేల్ టౌన్, మే 28 (ప్రభాతవార్త): పట్టణంలోని శ్రీహరిహరపుత్ర అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ అధ్యక్షులుగా ఎన్నికల్లో పోటీ చేయడానికి బొగ్గల సురేష్ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అయ్యప్పస్వామి ఆలయ అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతామని, అయ్యప్పస్వామి ఆలయ కమిటీ శాశ్వత సభ్యులు నామీద నమ్మకంతో నాకు ఓటు వేసి అధ్యక్షునిగా ఎన్నిక కావడానికి సహకరించాలని కోరారు. రాబోయే రోజుల్లో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రచిస్తున్నామని, అయ్యప్పస్వామి ఆలయ శాశ్వత సభ్యుల పూర్తి సహకారం నాకే ఉన్నదని, అందరూ మార్పు కోరుకుంటున్నారని తెలిపారు. జూన్ 7న జరగే ఆలయ కమిటీ ఎన్నికల్లో తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

శివసాయి రైస్‌మిల్లును సందర్శించిన ఆర్డిఓ

వెల్దుర్తి, మే 28, ప్రభాతవార్త : మండల కేంద్రంలోని పిఏసిఎస్ గోడౌన్ శివ సాయి రైస్ మిల్లును గురువారం తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా పిఏసిఎస్ గోడౌన్, శివ సాయి రైస్ మిల్ వద్ద నిల్వలు చేయటానికి అనుమతి ఇవ్వడం జరిగిందన్నారు. వెల్దుర్తి మాత్రమే వడ్ల నిల్వలు చేసుకోవాలని సెంటర్లో ఉన్న వడ్లను పూర్తిగా సెంట్రల్ ఇంచార్జ్ లకు ఆడియో ఆదేశాలు జారీ చేశారు. స్థానిక ఆరే నర్సింగ్‌యాదవ్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుండె పోటుతో యువకుడు మృతి

చిన్నశంకరంపేట, మే 28,ప్రభాతవార్త: గుండెపోటుతో యువకుడు మృతి చెందిన సంఘటన మండల పరిధి గవ్వలపల్లి తండాలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గవ్వలపల్లి తండాకు చెందిన లాలు, లక్ష్మీల దంపతులకు ఉదయ్ కిరణ్, క్రాంతికిరణ్‌లు సంతానం. లాలు నర్సాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా పనిచేస్తూ అక్కడే స్థిరపడ్డారు. వేసవి సెలవుల నిమిత్తం ఇరవై రోజుల క్రితం స్వగ్రామమైన గవ్వలపల్లి తండాకు వచ్చారు. ఉదయం చాతిలో నొప్పి వస్తుందని తెలుపగా కుటుంబసభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలో గుండె పోటుతో క్రాంతి కిరణ్ చనిపోయాడు. క్రాంతి డిగ్రి పూర్తి చేసి ప్రభుత్వ ఉద్యోగానికి సిద్ధం అవుతున్నట్లు తండ్రి లాలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీలోనూ క్రాంతి కిరణ్ చురుకుగా పనిచేసేవాడు. గత నర్సాపూర్ మున్సిపల్ ఎన్నికల్లో కౌన్సిలర్‌గా పోటిచేశాడని కుటుంబసభ్యులు తెలిపారు. చేతికి అందిన కుమారుడు మృతి చెందడంతో తల్లితండ్రులు, భార్య సునిత బాధ వర్ణణాతీతం. క్రాంతి కిరణ్‌కు సంవత్సరం వయస్సున్న కుమారుడు ఉన్నాడు. గుండె పోటుతో క్రాంతికిరణ్ మృతి చెందిన విషయం తెలుసుకున్న కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, మండలాధ్యక్షుడు మోహన్ నాయక్, జిల్లా నాయకులు రమణ, గోపాల్‌రెడ్డి, రాజిరెడ్డి, యాదవరావు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కాగా క్రాంతి కిరణ్ మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే బిఆర్ఎస్ నిరసనలు

కాంగ్రెస్ పార్టీ నాయకులు


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కొండపాక, మే 28, ప్రభాతవార్త : కాంగ్రెస్ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయడం లేదని బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఈ నెల 27న రోడ్లపైకి వచ్చి నిరసన వ్యక్తం చేయడం వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని కొండపాక మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ వాసరి లింగరావు, మండిపడ్డారు. గురువారం వెలకట్ట క్రాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ గ్రామాల్లో ఇప్పటికే చాలా వరకు ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని, లారీల కొరత ఉన్నమాట వాస్తవమేనని దాన్ని అధిగమించడానికి తహసీల్దార్‌లు, సిఐ, ఎస్సైలు లారీలను ఆపి కొనుగోలు కేంద్రాలకు పంపుతున్నారని తెలిపారు. ఇప్పటికే 54 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తూ వెంటనే డబ్బులు చెల్లిస్తుంటే జీర్ణించుకోలేని బిఆర్ఎస్ నాయకులు అక్కసుతో ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాలు చేస్తు నిరసనలు చేస్తున్నారని దుయ్యబట్టారు. బిఆర్ఎస్ పాలనలో వరి వేస్తే ఉరి అని ప్రకటించి ధాన్యం విత్తనాలను అమ్మొద్దని కలెక్టర్‌ల ఆధ్వర్యంలో సభలుపెట్టి రైతులను హెచ్చరించిన దుర్మార్గమైన చరిత్ర బిఆర్ఎస్ ప్రభుత్వానిదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ సిఎం ప్రస్తుత గజ్వేల్ ఎమ్మెల్యే కెసిఆర్ ప్రజా సమస్యలు పరిష్కరించకుండా పామ్‌హౌజ్‌కు పరిమితమయ్యారని విమర్శించారు. దొంగే దొంగ దొంగ అని అరిచనట్లుగా బిఆర్ఎస్ నాయకుల వ్యవహారం ఉందన్నారు. పామ్‌హౌజ్ నుండి బయటకు వచ్చి రైతుల, ప్రజల సమస్యలను పరిష్కరించాలని కెసిఆర్ పామ్ హౌజ్ ముందు ధర్నా చేసి డిమాండ్ చేయాలని ఆయన బిఆర్ఎస్ నాయకులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొల్పుల గంగాధర్, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుదర్శన్, పిఏసిఎస్ డైరెక్టర్ సురేందర్, నాయకులు మంచాల కనకరాములు, కనకయ్య, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుకు కృషి చేయాలి

-బిఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్ టౌన్, మే 28 (ప్రభాతవార్త): నూతనంగా ఎన్నికైన గజ్వేల్ అంబేద్కర్ సంఘం షాపింగ్ కాంప్లెక్స్ కమిటీ సభ్యులు గజ్వేల్ మండలంలోని అన్ని గ్రామాల్లో ఎస్సీ,ఎస్టీ,బిసి విద్యార్థుల భవిష్యత్తు కోసం కృషి చేయాలని బిఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీచైర్మన్ మాదాసు శ్రీనివాస్ ఆధ్వర్యంలో నూతన అంబేద్కర్ షాపింగ్ కాంప్లెక్స్ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో పాటు సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ నూతన కమిటీ మండలంలోని ప్రతి గ్రామంలో అంబేద్కర్ సంఘం ఏర్పాటు చేయాలని, దళిత బహుజన విద్యార్థుల విద్యకై కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు గంగిశెట్టి రవీందర్, కళ్యాణ్‌కార్ నర్సింగరావు, కప్పు పోచయ్య, కనకయ్య, మల్లేశం, పాల రమేష్‌గౌడ్, బైరం శివకుమార్, దళిత సంఘాల నాయకులు తుమ్మ శ్రీనివాస్, పొన్నాల కుమార్, చిప్పల యాదగిరి, మైస రాములు, నీరుడి స్వామి, గాలెంక శ్రీనివాస్, అంబేద్కర్ షాపింగ్ కాంప్లెక్స్ అధ్యక్ష కార్యదర్శులు మస్కూరి కిష్టయ్య, బొల్లారం ఎల్లయ్య, ఉపాధ్యక్షుడు మన్నె కృష్ణ, మాచపురం బాల్‌నర్సయ్య, పొట్ట యాదగిరి, కోశాధికారి పంబాల సత్యనారాయణ, గౌరవ అధ్యక్షుడు అటుకూరి రాములు, కార్యవర్గ సభ్యులు సల్ల నాగయ్య, పంబాల ఎల్లయ్య, దమ్మని మల్లయ్య, నాగయ్య, మైస స్వామి, చింతకింది బాలయ్య, మైసని మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయులు నందమూరి తారకరామారావు

-మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్ టౌన్, మే 28 (ప్రభాతవార్త): తెలుగు ప్రజల గుండెల్లో చిరస్మరణీయ నాయకునిగా నిలిచిన వ్యక్తి నందమూరి తారకరామారావు అని ఎఫ్‌డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు జయంతిని పురస్కరించుకొని గజ్వేల్‌లో ఆయన విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత రాజకీయాల్లోకి రావడానికి ఎన్‌టిఆర్ స్పూర్తి అని, వారి అడుగుజాడల్లో యువత పయనించాలని పిలుపునిచ్చారు. పేద ప్రజల సంక్షేమం కోసం ఆయన ప్రవేశపెట్టిన రెండురూపాయలకు కిలో బియ్యం, జనతా వస్త్రాలు, పక్కా గృహాల వంటి పథకాలు ఇప్పటికీ ఆదర్శంగా నిలుస్తున్నాయని గుర్తుచేశారు. కార్యక్రమంలో టిపిసిసి కార్యదర్శి నాయిని యాదగిరి, మాజీ కౌన్సిలర్ సుభాష్‌చంద్రబోస్, వెంకటేశ్వర్లు, టీచర్ మల్లికార్జున్, నాయకులు పరుచూరి రాజు, ఆర్‌కె.శ్రీనివాస్, మోచి ప్రభాకర్, ఎన్‌టిఆర్ అభిమానులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళులు

ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

నర్సాపూర్, మే 28, ప్రభాతవార్త : మండల పరిధిలోని చిన్న చింత కుంట గ్రామంలో గురువారం స్వర్గీయ ఎన్‌టిఆర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సరిత మహేష్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వజ్జ పెంటయ్య, వార్డు సభ్యులు నరసింలూ, గ్రామస్తులు నరసింహారెడ్డి, శ్రీనివాస్ గౌడ్,ప్రభాకర్, వడ్ల రమేష్, బండారి సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

30న బివిఆర్ఐటిలో ఏఐ డిజిటల్ లెర్నింగ్‌పై అవగాహన

నర్సాపూర్, మే 28, ప్రభాతవార్త : పట్టణ సమీపంలోని బివి రాజు ఇంజనీరింగ్ కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వం, జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ హైదరాబాద్ సహకారంతో 6 నుంచి 9వ తరగతి విద్యార్థుల కోసం ఉచిత ఏఐ డిజిటల్ లెర్నింగ్ అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ప్రిన్సిపాల్ సంజయ్ దుబే తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం మే 30న నిర్వహించబడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ,డిజిటల్ విద్య ,స్మార్ట్ లెర్నింగ్ విధానాలు, ఆధునిక సాంకేతికతపై అవగాహన కల్పించడం ప్రధాన లక్ష్యం అన్నారు. అదేవిధంగా విద్యార్థులకు ఏఐ డిజిటల్ టెక్నాలజీల ప్రాథమిక పరిజ్ఞానం అందించడం, డిజిటల్ లెర్నింగ్ పద్ధతులపై అవగాహన పెంపొందించడం, సృజనాత్మకత సాంకేతిక ఆలోచనలను ప్రోత్సహించడం, భవిష్యత్తులో టెక్నాలజీ రంగంలో ఉన్న అవకాశాలను పరిచయం చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక ప్రదర్శనలు ఇంటరాక్టివ్ సెషన్లు, విద్యార్థులకు ఉపయోగకరమైన డిజిటల్ లెర్నింగ్ కార్యక్రమాలు నిర్వహించబడతాయని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని ఆయన కోరారు. మరిన్ని వివరాల కోసం9666023743,7842223743, ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలని ఆయన కోరారు

మహిళా సంఘాలకు రూ. పది లక్షల వడ్డీ లేని రుణాలు

ఏపిఎం సంగమేశ్వర్

నర్సాపూర్, మే 28, ప్రభాతవార్త : మహిళా గ్రామ సంఘాలకు 10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు ఇవ్వడం జరుగుతుందని ఏపీఎం సంగమేశ్వర్ తెలిపారు. బుధవారం నర్సాపూర్ మండలం సమైక్యలో ప్రత్యేక సమావేశం 99 రోజుల ప్రణాళికలో భాగంగా నిర్వహించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ గ్రామ సంఘాల్లో 25వ తేదీ నుండి 30వ తేదీ వరకు చేసిన పనులు చేయాల్సిన పనుల గురించి వివరించారు ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామ సంఘాల భవన నిర్మాణాలకు భూమిపూజ చేశామన్నారు. అలాగే నాలుగురకాల కొత్త సంఘాలు ఏర్పాటు చేయడం మండల సమైక్యాలలో ప్రత్యేక సమావేశాలు నిర్వహించడం, బ్యాంకు లింకేజీ 5 కోట్లు ఈ నెల 30 వరకు పూర్తి చేయడం, శ్రీనిధి రుణాలు 100 శాతం రికవరీ చేయడం సంఘాలను బలోపేతం చేయడం వంటి వాటిపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. అంతేగాక గ్రామ సంఘాలకు పది లక్షల వరకు వడ్డీ లేని రుణాలు ఇవ్వడం నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్స్కీమ్ గురించి జీవనోపాదుల గురించి వివరించారు.ఈ సమావేశంలో సీసీలు నాగరాజు నర్సింలు దేవి సింగ్ రవీందర్ ప్రవీణ అకౌంటెంట్ మల్లేశం ఆపరేటర్ సురేష్ మండలంలోని అన్ని గ్రామ సంఘాల అధ్యక్షులు కార్యదర్శులు పాల్గొన్నారు అనంతరం గత సంవత్సరంలో 100 లక్ష్య సాధించిన గ్రామ సంఘాలకు సన్మానించారు.



మాట్లాడుతున్న ఏపీఎం సంగమేశ్వర్

రైతులు అధైర్యపడొద్దు.. పుకార్లు నమ్మొద్దు

- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్
-అకాలవర్షాలకు తడిసిన ధాన్యాన్ని కొనుగోలుచేస్తాం

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రాతిమా

నర్సాపూర్ రూరల్, మే 28, ప్రభాతవార్త: అకాలవర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం పూర్తిగా కొనుగోలు చేస్తుందని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ స్పష్టంచేశారు. పుకార్లను నమ్మి మధ్యవర్తులను ఆశ్రయించవద్దని రైతులకు సూచించారు. బుధవారం నర్సాపూర్ మండలం తుల్జారంపేట్‌గ్రామంలోని ఐకెపి ఆధ్వర్యంలో నిర్వ హిస్తున్న ధాన్యం కొనుగోలుకేంద్రాన్ని ఆర్డీఓ రామ కృష్ణ, తహసీల్దార్ శ్రీనివాస్‌లతో కలిసి కలెక్టర్ పరి శీలించారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లావ్యాప్తంగా సుమారు 400మెట్రిక్ టన్నుల ధాన్యం వర్షానికి తడిసిందని నివేదికలు అందాయని తెలిపారు. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టి బాయిల్డ్ రైస్‌మిల్లులకు తరలించడం ద్వారా రైతులకు ఎలాంటినష్టం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సివిల్‌సప్లై శాఖ మధ్యాహ్నం అందించిన నివేదిక ప్రకారం ఇప్పటికే 250మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని బాయిల్డ్ రైస్‌మిల్లులకు తరలించినట్లు వెల్లడించారు. మిగిలిన ధాన్యాన్ని కూడా బుధవారం సాయంత్రం నాటికి మిల్లులకు పంపించేలా చర్యలు చేపట్టామని తెలిపారు. రైతులు అధైర్యపడకుండా ఉండాలని, ప్రభుత్వం, సంబంధితశాఖలు ధాన్యం కొనుగోలు ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తున్నా యని కలెక్టర్ పేర్కొన్నారు. రైతులు ఎలాంటి అపోహలకు లోనుకాకుండా అధికారులను సంప్రతించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీని వాస్, సివిల్ సప్లై అధికారులు, ఇతరశాఖల అధికారులు పాల్గొన్నారు.

కొల్చారంలో...

కొల్చారం, మే 28, ప్రభాతవార్త: మంగళవారం కలెక్టర్ క్యాంపుకార్యాలయం నుంచి అదనపు కలెక్టర్ నగేష్, ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపిడివోలు, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారులతో కలిసి నిర్వహించిన గూగుల్ మీట్‌లో కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడారు. జిల్లాలో కురిసిన అకాలవర్షాల ప్రభావంతో సుమారు 4వేల క్వింటాళ్ల ధాన్యం తడిసినట్లు నివేదికలు అందాయని వెల్లడించారు. ముఖ్యంగా కొల్చారం, కౌడిపల్లి, టేక్మాల్, శంకరంపేట(ఏ) మండలాల్లో అధిక వర్షపాతం నమోదైందని తెలిపారు. వర్షాల నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు అందుబాటులో ఉంచి ధాన్యాన్ని రక్షించేచర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. జిల్లాలో ఇప్పటివరకు 59,227మంది రైతుల నుంచి 2,76,776.600 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుచేసినట్లు కలెక్టర్ వివరించారు. అలాగే 39,879మంది రైతుల ఖాతాల్లో రూ.441.15 కోట్లను జమచేసినట్లు తెలిపారు. ఇప్పటికే 18 కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ పూర్తై కేంద్రాలను మూసివేసినట్లు పేర్కొన్నారు. టోకెన్ పొందిన రైతులవివరాలు, ధాన్యం రవాణాచేసిన వాహనాలసంఖ్య, గన్ని సంచుల లభ్యత, నిల్వలో ఉన్న ధాన్యం, తేమ శాతం(మాయిశ్చర్) వంటి వివరాలను ఎప్పటికప్పుడు నమోదుచేయాలన్నారు. ఈసమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, మెదక్ ఆర్డీవో రమాదేవి, తూప్రాన్ ఆర్డీవో జైచంద్రారెడ్డి, నర్సా పూర్ ఆర్డీవో రామకృష్ణ, జిల్లా పౌరసరఫరాల అధికారులు నిత్యానంద్, జగదీష్, తహసీల్దార్లు, ఎంపిడివోలు తదితరులు పాల్గొన్నారు.

ఈ బైపాస్ దాటాలంటే వణుకే..!

సదాశివపేట, మే 28, ప్రభాతవార్త: సదాశివపేట పట్టణం నుంచి కోల్కూర్, పొట్టిపల్లె, నిజాంపూర్, వెల్టూరు గ్రామాలకు వెళ్లే హైవే బైపాస్ రోడ్డు మృత్యుకుహరంగా మారింది. రాత్రి వేళల్లో ఈమార్గంలో ప్రయాణించాలంటే వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. కొన్ని నెలలుగా బైపాస్ వద్ద వీధిదీపాలు వెలగకపోవడంతో అక్కడ పూర్తిగా చీకట్లు అలుముకుంటున్నాయి. దీంతో తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటుండగా, ఇప్పటికే పలువురు గాయపడటంతోపాటు ప్రాణాలు కూడా కోల్పోయిన ఘటనలు జరిగినట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, మహిళలు, విద్యార్థులు రాత్రి సమయంలో ఈరోడ్డుపై ప్రయాణించేందుకు జంకుతున్నారు. ప్రతిరోజూ వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ ప్రధానమార్గాన్ని అధికారులు పట్టించుకోకపోవడం పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. ప్రమాదాలు జరుగుతున్నా, సంబంధితశాఖ అధికారులు స్పందించకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడుతున్నారు. ఇకనైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి బైపాస్‌వద్ద వెంటనే వీధి దీపాలు ఏర్పాటుచేసి ప్రమాదాలను నివారించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

క్వింటాల్ ధాన్యానికి 6కిలోల తరుగు

-రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి వశ్య పద్మ

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కొండాపూర్, మే 28, ప్రభాతవార్త: క్వింటాల్ ధాన్యానికి 6కిలోల మేర తరుగు తీస్తున్నారని రైతులు అంజయ్య గౌడ్, ప్రసాద్, నత్తెమ్మలు తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం ప్రధాన కార్యదర్శి వశ్య పద్మ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు అన్యాయం చేసేవిధంగా తరుగుపేరుతో అధికంగా కోతలువిధించడం సరికాదన్నారు. అకాలవర్షాలతో కొనుగోలు కేంద్రాలు, కళ్లాల్లో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలుచేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్‌చేశారు. గురువారం మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రాన్ని జిల్లా రైతు సంఘం ఇంచార్జి సీహెచ్ దశరథ్‌తో కలిసి సందర్శించిన వశ్య పద్మ తడిసిన ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సొసైటీ సెక్రటరీని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అకాలవర్షాలతో ఆరబోసిన వరి, జొన్న పంటలు దెబ్బతిన్నాయని, ఈపరిస్థితుల్లో రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోకుండా త్వరితగతిన కొనుగోలుప్రక్రియ పూర్తిచేయాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, పాడిరైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి సంజీవరెడ్డి, నాయకులు రాంరెడ్డి, బ్రహ్మం, బాల్‌రాజ్, నర్సింలు, శివరాములు, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్‌నేత

సదాశివపేట, మే 28, ప్రభాతవార్త: బక్రీద్ పండుగ సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పులిమామిడి రాజు ముస్లింలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు. యువత మంచిమార్గంలో ముందుకు సాగాలని సూచించారు. ప్రజలమధ్య ప్రేమాభిమానాలు పెరగాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో రియాజ్, మోహిజ్, ఫయాజ్, బబ్బు, చోటు మొదలగువారు పాల్గొన్నారు.

ఘనంగా బక్రీద్-ఈద్గాల వద్ద ప్రార్థనలు

ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింల దృశ్యం

పుల్‌కల్, మే 28, ప్రభాతవార్త: ఉమ్మడి పుల్‌కల్ మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం బక్రీద్ పండగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. నూతన వస్త్రాలు ధరించి గ్రామాల్లోని ఈద్గాలవద్దకు చేరుకుని సామూహిక ప్రార్థనలు చేశారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

మండలంలో ఘనంగా బక్రీద్ పండగ

మనూర్, మే 28, ప్రభాతవార్త: మండల కేంద్రమైన మనూర్‌తో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం బక్రీద్ పండగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. గ్రామంలోని ఈద్గాలవద్దకు చేరుకుని సామూహికంగా ప్రత్యేక ప్రార్థనలు చేసి ఒకరికొకరు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ఘనంగా బక్రీద్ వేడుకలు

జహీరాబాద్, మే 28, ప్రభాతవార్త: బక్రీద్ పండుగను గురువారం జహీరాబాద్ పట్టణంతోపాటు మండలంలోని పలుగ్రామాల్లో ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా ఆయాగ్రామాల ఈద్గా మైదానాల్లో ప్రత్యేకప్రార్థనలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొని ప్రార్థనలు చేసి, అనంతరం ఒకరినొకరు ఆలింగనంచేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. జహీరాబాద్ పట్టణంలోని ఈద్గా మైదానంలో నిర్వహించిన ప్రధాన ప్రార్థన కార్యక్రమంలో ముస్లిం మతపెద్దలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు. బక్రీద్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా డిఎస్పీ సైదానాయక్, సిఐ శివలింగం ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ఎస్సైలు లవకుమార్, ఎం.కాశీనాథ్, రాజేందర్‌రెడ్డి, నరేష్, క్రాంతికుమార్ పాటిల్, సుజిత్, చైతన్య కిరణ్ తదితరులు పోలీస్‌సిబ్బందితో కలిసి బందోబస్తు నిర్వహించారు.

బక్రీద్ వేడుకల్లో మాజీమంత్రి

ఈద్గా మైదానంలో ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

జహీరాబాద్, మే 28, ప్రభాతవార్త: బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని జహీరాబాద్ పట్టణంలోని ఈద్గా మైదానంలో నిర్వహించిన బక్రీద్‌వేడుకల్లో మాజీమంత్రి డా.ఎ.చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం మతపెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులతో ఆలింగనంచేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఇండస్ట్రియల్ చైర్మన్ తన్వీర్, జహీరాబాద్ మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్, పట్టణ అధ్యక్షుడు కండేం నర్సింలు, మాజీ వైస్‌చైర్మన్ ఖాజా, కౌన్సిలర్ జహంగీర్, మహేష్, ఎఎంసి డైరెక్టర్ శేఖర్, కాంగ్రెస్ నాయకులు హుగ్గెల్లి రాములు, మొయిజ్ ఇనాయత్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

కొల్చారంలో ఘనంగా బక్రీద్ పండుగ

బక్రీద్ పండుగను జరుపుకొంటున్న ముస్లింలు దృశ్యం

కొల్చారం, మే 28, ప్రభాతవార్త: బక్రీద్ పండుగ త్యాగానికి ప్రతీక అని కొల్చారం మస్జిద్ ఇమామ్ దావుద్ ఖాన్ పేర్కొన్నారు. కొల్చారం మండలవ్యాప్తంగా ముస్లింలు బక్రీద్ పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కొల్చారం ఈద్గావద్ద ప్రత్యేక సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ముస్లింలు ఒకరినొకరు ఆలింగనంచేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. తదనంతరం గ్రామంలోని ప్రసిద్ధ షేక్ షాబొద్దిన్ దర్గావద్ద ప్రత్యేకప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమీర్, మున్ను, ఖాలీమ్, సయ్యద్ అక్రమ్, హైమద్, ఆర్షద్, సాజిద్, ఫాహాద్ తదితరులు పాల్గొన్నారు.

జనసంద్రంగా మారిన నల్లపోచమ్మ ఆలయం

-ఘనంగా 6వ వారం జాతర ఉత్సవాలు

నల్లపోచమ్మతల్లిని దర్శించుకుంటున్న భక్తుల దృశ్యం

మనూర్, మే 28, ప్రభాతవార్త: మండలపరిధిలోని బోరంచగ్రామంలో కొలువున్న శ్రీనల్లపోచమ్మ ఆలయం 7వారాల జాతరను పురస్కరించుకుని ఆయాప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకోవడంతో ఆలయ పరిసరాలను జనసంద్రంగా మారాయి. ఆలయానికి ఉమ్మడిమెదక్ జిల్లాతోపాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలనుంచి భక్తులు చేరుకుని అర్చకులు శ్రీకాంత్, సిద్దు, నాగయ్య, ప్రవీణ్‌లు వేదమంత్రాలు వల్లిస్తుండగా ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎస్ఐ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆలయ పరిసరాల్లో బందోబస్తును నిర్వహించారు.

మండలంలో 5 ప్రీప్రైమరీ పాఠశాలల ఎంపిక

మొగుడంపల్లి, మే 28, ప్రభాతవార్త: మండలంలోని ఆయా గ్రామాల్లోని చిన్నారులకు నాణ్యమైన విద్యను అందించేందుకు 5 ప్రభుత్వ పాఠశాలలను ప్రీప్రైమరీ పాఠశాలలుగా ఎంపిక చేసినట్లు మండల విద్యాధికారి జాఫర్ అలీ తెలిపారు. మండల కేంద్రమైన మొగుడంపల్లి, మండలంలోని రాయిపల్లి తాండ, గోపంపల్లి, మాడ్గి, అసద్ గంజ్ గ్రామాల్లో ఎల్‌కెజి, యుకెజి తరగతులను 2026-27 విద్యా సంవత్సరం నుంచి ప్రారంభిస్తున్నామన్నారు. చిన్నారులకు ఆటల ద్వారా అభ్యాసం, సృజనాత్మక నైపుణ్యాల అభివృద్ధికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎంపిఓ జాఫర్ అలీ వివరించారు.

భక్తి మార్గంతోనే మానవ జన్మకు ముక్తి

-సకల మత స్థాపకులు సద్గురు కాశీనాథ్ బాబ

మనూర్, మే 28, ప్రభాతవార్త: భక్తిమార్గంతోనే మానవజన్మకు ముక్తిలభిస్తుందని మండలపరిధిలోని పంచగామ ఆశ్రమ పీఠాధిపతి సకలమత స్థాపకులు సద్గురు కాశీనాథ్‌బాబ అన్నారు. గురువారరం మండలపరిధిలోని మాయికోడ్‌ల శ్రీవీరభద్రేశ్వర ఆలయంలో సప్తాహ ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కాశీనాథ్‌బాబ మాట్లాడుతూ ప్రతిసంవత్సరం గ్రామంలో సప్తాహకార్యక్రమాలు, భజనలు, కీర్తనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించడం గ్రామానికి శుభపరిణామమన్నారు. ఉదయం గ్రామ మహిళలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ బాజాభజంత్రీలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయానికి చేరుకున్న భక్తులకు అన్నదాన వితరణ చేశారు.

ఘనంగా ఎన్టీఆర్ జయంతి

జహీరాబాద్, మే 28, ప్రభాతవార్త: తెలుగు ప్రజల ఆరాధ్యదైవం, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) జయంతి వేడుకలను జహీరాబాద్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని రాంనగర్ చౌరస్తా వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహానేత ఎన్టీఆర్ అని కొనియాడారు. ఆయన సేవలను స్మరించుకుంటూ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు బండమీది శ్రీనివాస్, కె.రాంచందర్, సురేష్, ఎస్.గోపాల్, చెంగల్ జైపాల్, టి.శివన్న, నాగరాజ్, ఛన్ మల్లు, పవన్‌రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఉద్యమకారులు

గుమ్మడిదల, మే 28, ప్రభాతవార్త: సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మున్సిపల్‌పరిధిలో తెలంగాణ ఉద్యమకారులు సమావేశమై తమ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్‌చేశారు. తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఈసమావేశంలో మలిదశ తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన అనేకమంది ఉద్యమకారులు ప్రస్తుతం జీవనోపాధి లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో దర్గా శ్రీనివాస్, వాలందాస్ మల్లేష్‌గౌడ్, కుమ్మరి వెంకటేష్, చింతల రాజు, అంజనేయులు, దప్పు జీవన్‌కుమార్, రామకృష్ణగౌడ్, ఎండి గరీబ్, వడ్డెర ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సొసైటీపై ఫిర్యాదు చేసిన నాయకుడి నిలదీత

సిర్గాపూర్, మే 28, ప్రభాతవార్త: మండలపరిధిలోని బొక్కస్‌గావ్‌లోని సొసైటీలో అవినీతి చోటు చేసుకుందని మండలపరిధిలోని అంతర్గాంకుచెందిన నాయకుడుచేసిన ఫిర్యాదును రైతులు తప్పుబడుతూ నాయకుడిని నిలదీశారు. సొసైటీపై సదరు నాయకుడు చేసిన ఫిర్యాదుతో సబ్ కలెక్టర్ ఉమాహారతి సొసైటీలో విచారణ చేసేందుకు రాగా సొసైటీలో ఎలాంటి అవకతవకలు లేవని రైతులు సబ్ కలెక్టర్ ముందు స్పష్టంచేశారు. రాజకీయ లబ్దికొరకే ఆ నాయకుడు సొసైటీలో అవినీతి అంటూ ఆరోపించాడంటూ రైతులు సదరునాయకుడిని తమదైనరీతిలో ప్రశ్నిస్తుండగా పోలీసులు అడ్డుకుని నాయకుడిని వాహనంపై సురక్షితంగా అక్కడి నుంచి వెళ్లిపోయేలా చేశారు.

రైతు గోసను పట్టించుకోని ప్రభుత్వం

-పంట పడించడం కష్టం-అమ్ముకోవడం నరకం

సిర్గాపూర్, మే 28, ప్రభాతవార్త: అందిరికీ అన్నంపెట్టే అన్నదాత బతుకు భారమైపోతోంది. ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు అన్నదాత పడుతున్న పాట్లు చెప్పనలవిగాకుండా ఉన్నాయి. పంటల సాగుసమయంతో అతివృష్టి, అనావృష్టితో రైతులు పెట్టిన పెట్టుబడులుసైతం వచ్చేపరిస్థితి లేకుండా పోతుండటంతో అన్నదాతల ఆర్థిక పరిస్థితి మరీ దయనీయంగా మారుతోంది. మండల పరిధిలోని బొక్కస్‌గావ్ సొసైటీ ద్వారా వరి కొనుగోలు చేస్తుండగా ఓ పార్టీ నాయకుడు రాజకీయ లబ్దికొరకు సొసైటీపై తప్పుడు ఆరోపణలు, ఫిర్యాదు చేసి రైతులచే చీవాట్లు తిన్న సంఘటనలు చూస్తుంటే రాజకీయాలే కావాలి కాని, రైతులు పడుతున్న పాట్లను పరిష్కరించేందుకు చొరవ తీసుకోవడం లేదని తెలుస్తోంది. సదరు నాయకుడు సొసైటీపై చేసిన ఫిర్యాదుతో విచారణ నిర్వహించిన సబ్ కలెక్టర్ ఉమాహారతికి ధాన్యం కొనుగోలు సొసైటీ ద్వారనే జరపాలని, ఐకెపిద్వారా వద్దని రైతులు చెప్పేప్రయత్నం చేస్తుండగా పోలీసులు లాఠీచార్జి చేయడం తగునా అని రైతులు మండిపడుతున్నారు. ధాన్యాన్ని ఐకెపిద్వారా కాకుండా సొసైటీద్వారానే కొనుగోలుచేసేలా చూడాలని రైతులు సబ్ కలెక్టర్ ఉమాహారతి దృష్టికి తీసుకుపోయారు.

నేటి నుంచి రైతులకు జీలుగ విత్తనాలు

పంపిణీకి సిద్ధంగా ఉన్న జీలుగ, జనుము విత్తనాల దృశ్యం

చౌటకూరు, మే 28, ప్రభాతవార్త: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రైతులకు చౌటకూరులోని ఆగ్రోస్ రైతు సేవాకేంద్రంలో శుక్రవారం నుంచి జీలుగ, జనుము విత్తనాల పంపిణీ కార్యక్రమం ఈ నెల 29న ఉదయం 7గంటలకు ప్రారంభిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్ తెలిపారు. 50శాతం సబ్సిడీపై జీలుగ విత్తనాలు 30కిలోల బస్తా 2460 రూపాయలకు, జనుము 40కిలోల బస్తా 3120 రూపాయలకు అందచేయడం జరుగుతుందన్నారు. రైతులు తమ ఆధార్‌కార్డు, పట్టపాసు పుస్తకం జిరాక్సుపత్రాలతో చేరుకుని సబ్సిడీపై విత్తనాలు అందుకోవాలన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రవీణ్ మండల రైతులకు వివరించారు.

ఘనంగా శ్రీలక్ష్మీ సుదర్శన మహాయాగం

-యాగంలో ఎమ్మెల్యే దంపతులు

నారాయణఖేడ్, మే 28, ప్రభాతవార్త: నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణంలోని శ్రీమహతి జ్యోతిష్యాలయం నందు లోకకళ్యాణార్థం శ్రీలక్ష్మీ సుదర్శన మహాయాగం అత్యంతవైభవంగా కొనసాగుతోంది. పురోహితులు, స్మార్త జ్యోతిష్య చండీ ఉపాసకులు మాల్కంచి గురు రాజశర్మ ఆధ్వర్యంలో అధిక జ్యేష్ఠమాసం సందర్భంగా ఈమహాయాగం నిర్వహిస్తున్నారు. ఈ నెల 18వ తేదీన ప్రారంభమైన ఈ క్రతువు జూన్ 15వ తేదీ అమావాస్య పాడ్యమి వరకు నెల రోజుల పాటు నిరంతరాయంగా కొనసాగనుంది. ఈ మహాయజ్ఞంలో భాగంగా గురువారం జరిగిన ప్రత్యేక పూజాకార్యక్రమాలలో నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవ రెడ్డి, అనుపమసంజీవరెడ్డి దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో యాగ నిర్వాహకులు మాల్కంచి గురురాజశర్మ ఎమ్మెల్యే దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ల సుధాకర్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు, పట్టణ ప్రము ఖులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి అద్దాల పంపిణీ

నారాయణఖేడ్, మే 28, ప్రభాతవార్త: ఈనెల మే 14వ తేదీన ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వారి స్వగృహంలో ఉచిత కంటి వైద్య పరీక్షల శిబిరాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ శిబిరంలో నియోజకవర్గంలోని వందలాదిమంది ప్రజలకు నిపుణులైన వైద్యులచే ఉచితంగా కంటిపరీక్షలు నిర్వహించారు. అనంతరం పరీక్షలు చేయించుకున్నవారిలో కళ్లజోళ్లు అవసరమైన లబ్ధిదారులకు గురువారం నారాయణఖేడ్ ఎమ్మెల్యే లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ పట్లోళ్ల సంజీవ రెడ్డి చేతులమీదగా ఉచితంగా కళ్లజోళ్లను అందజేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు, స్థానికనాయకులు, ప్రజాప్రతినిధులు లబ్ధిదారులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

వాసర్‌లో మన ఊరి ప్రభుత్వ బడిబాట

మన ఊరి ప్రభుత్వ బడిబాట నిర్వహిస్తున్న దృశ్యం

సిర్గాపూర్, మే 28, ప్రభాతవార్త: మండల పరిధిలోని వాసర్ గ్రామంలో గురువారం మన ఊరి ప్రభుత్వ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో సర్పంచ్ హనుమంతరావు పాటిల్, ఉపసర్పంచ్ విఠల్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కార్యక్రమాన్ని ప్రారంభించి గ్రామంలో అవగాహనర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులతో పాటు నాణ్యమైన విద్యను అందిస్తున్నారని అందుకు బడి ఈడు పిల్లలను ప్రభుత్వపాఠశాలల్లోనే చేర్పించి పిల్లల బంగారుభవితకు బాటలువేయాలని తల్లిదండ్రులకు సూచించారు.

వస్తాపూర్ వార్డులో నూతన బోర్

జహీరాబాద్, మే 28, ప్రభాతవార్త: జహీరాబాద్ పట్టణంలోని వస్తాపూర్ వార్డు నం.3లో నూతనంగా ఏర్పాటు చేసిన బోర్‌ను రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకురాలు డాక్టర్ ఎస్.ఉజ్వలరెడ్డి ప్రారంభించారు. స్థానిక ప్రజలకు తాగునీటి సమస్యలు తీరేలా ఈ బోర్ ఉపయోగపడుతుందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ జి.శ్రీధర్‌రెడ్డి, సీనియర్ నాయకులు పి.శ్రీకాంత్ రెడ్డి, జహీరాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పి.నర్సింహారెడ్డి, సిడిసి డైరెక్టర్ మల్లారెడ్డి, యూత్‌కాంగ్రెస్ నాయకుడు అశ్విన్‌పాటిల్, కె.భీమయ్య, మాజీ ఎస్సీసెల్ నాయకులు నాతనీయల్, నరేష్, బబ్లు తదితర గ్రామ నాయకులు పాల్గొన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని నాయకులు పేర్కొన్నారు.

గర్డేగాంలో జొన్నల కొనుగోలు కేంద్రం

సిర్గాపూర్, మే 28, ప్రభాతవార్త: మండల పరిధిలోని గర్డేగాంలో ఏర్పాటుచేసిన జొన్నల కొనుగోలుకేంద్రాన్ని గురువారం సర్పంచ్ నగేష్‌యదవ్ ప్రారంభించారు. ఈసందర్భంగా సర్పంచ్ నగేష్‌యాదవ్ మాట్లాడుతూ రైతులు పండించిన జొన్నలను కొనుగోలు కేంద్రానికి తరలించాలన్నారు. మధ్య దళారులకు జొన్నలు అమ్ముకుని ఆగం కావొద్దని రైతులకు సూచించారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ కేరోబారావు, నారాయణ, భూముగొండ, రమేష్ తదితరులు ఉన్నారు.

తడిసిన ధాన్యం ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

-బిఆర్ఎస్ పార్టీ నాయకులు నాయిని ఉదయ్‌రంజన్‌గౌడ్



మాట్లాడుతున్న బిఆర్ఎస్ పార్టీ నాయకులు నాయిని ఉదయ్‌రంజన్‌గౌడ్

మనోహరాబాద్, మే 28, ప్రభాతవార్త: అధికారుల నిర్లక్ష్యం వల్ల కొనుగోలు కేంద్రాల్లో ఉన్నటువంటి ధాన్యం ఈవర్షానికి పూర్తిగా తడిసిపోయి రైతులకు భారీ నష్టాన్ని కలిగించిందని బిఆర్ఎస్‌పార్టీ మనోహరాబాద్ మండల నాయకులు నాయిని ఉదయ్‌రంజన్‌గౌడ్ ఆవేదన వ్యక్తంచేశారు. గత నెలరోజుల నుండి ధాన్యాన్ని కొనుగోలు చేయమంటే, హమాలీలు లేరు, రవాణా లేదు, వాహనాలు లేవు అని సమాధానాలు చెప్పారని, తక్షణమే ధాన్యం మొత్తం కొనుగోలు చేయాలని బిఆర్ఎస్ పార్టీ గజ్వేల్ నియోజకవర్గ ఇన్చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో మనోహరాబాద్ మండలంలోని దండుపల్లి ఐకెపి సెంటర్ దగ్గర రోడ్డుపై బైఠాయించడం జరిగిందని, మూడు నాలుగు రోజుల్లో వర్షాలు వచ్చే అవకాశం ఉంది కాబట్టి వెంటనే ధాన్యం మొత్తం కొనుగోలు చేయాలని ఆర్డీవో, ఎమ్మార్వోలకు విజ్ఞప్తి చేయడం జరిగిందని, అయినా కూడా అధికారుల నిర్లక్ష్యం, కాంగ్రెస్ ప్రభుత్వ రైతువ్యతిరేక విధానాల వల్ల రైతులధాన్యం మొత్తం వర్షంలో తడిసిపోయిందని నాయిని ఉదయ్‌రంజన్‌గౌడ్ పేర్కొన్నారు. సమయం మించిపోయిన తర్వాత కూడా కొనుగోలు చేయకుండా నిర్లక్ష్యం చేసినటువంటి ఈ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రతి ఒక్క రైతన్న ప్రశ్నించాలి, నిలదీయాలని నాయిని ఉదయ్‌రంజన్‌గౌడ్ పిలుపునిచ్చారు. తడిసిన మొత్తంధాన్యాన్ని ఎలాంటి ఆంక్షలు లేకుండా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, లేనిపక్షంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతుల పక్షాననిలబడి రైతులకు నష్టపరిహారం అందేవరకు, న్యాయం జరిగేవరకూ పోరాటాన్ని రైతులతో కలిసి ఉధృతంచేస్తామని బిఆర్ఎస్‌పార్టీ నాయకులు ఉదయ్‌రంజన్‌గౌడ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు జక్కిడి ఇంద్రసేనారెడ్డి, దుర్గం మధుగౌడ్, సాయి రెడ్డి బిక్షపతిరెడ్డి, తేలు సుధాకర్, అనంతరం నరేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.